


# మనం
## మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల, నారాయణ పేట, వనపర్తి

ఆదివారం | 21 | జూన్ | 2026 | పేజీలు 12 | www.manamepaper.com


# చదువుతోనే ఉజ్వల భవిష్యత్‌కు బాటలు

**రాష్ట్ర మైనార్టీ గురుకుల విద్యా సంస్థల్లో అన్ని సౌకర్యాలు కల్పనకు కృషి**

**మైనార్టీ విద్యార్థులు కష్టపడి గురుకుల పాఠశాలల్లో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, జిల్లాకు పేరు ప్రతిష్టలు తేవాలి**

**రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్**

*చదువు తోనే ఉజ్వల భవిష్యత్ అని, విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్ లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం బోయపల్లిలో రూ. 20 కోట్లతో నూతనంగా నిర్మించిన తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల భవనం 1 ను, రూ.2 కోట్ల 10 లక్షలతో నిర్మించిన బాలికల వసతి గృహం భవనంను రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ, ప్రభుత్వ రంగ సంస్థల శాఖా మంత్రి మహ్మద్ అజారుద్దీన్ , ప్రభుత్వ విప్,మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు.*

*– మహబూబ్ నగర్ ప్రతినిధి జూన్ 20 (మనం బ్యూరో)*

మహబూబ్ నగర్ ప్రతినిధి జూన్ 20 (మనం బ్యూరో) : ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం మైనార్టీ విద్యార్థుల సంక్షేమం కు కృత నిశ్చయంతో పని చేస్తుందన్నారు. మైనార్టీ విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలన్నారు. జీవితంలో స్థిర పడాలంటే చదువు చాలా ముఖ్యమన్నారు. ప్రభుత్వం మైనార్టీ గురుకుల

- మిగతా 2లో..








# యోగాతో ఏకాగ్రత

**పాలమూరు విశ్వవిద్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు**



మహబూబ్ నగర్, 20జూన్, (మనం న్యూస్) : పాలమూరు విశ్వవిద్యాలయం సెంట్రల్ లైబ్రరీ ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో

- మిగతా 3లో..

# నేటి నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

**పరీక్ష కేంద్రానికి ఆలస్యం అయితే అనుమతి ఉండదు**

**నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ప్రయాణం ఉచితం**

**పరీక్షకు హాజరై ప్రతి అభ్యర్థి అడ్మిట్ కార్డు తీసుకురావాలి**

**మొబైల్స్, ఎలక్ట్రానిక్, గ్యాడ్జెట్స్ వాటికి అనుమతి లేదు**

**మహబూబ్నగర్ జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా**



ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 20 (మనం బ్యూరో) : నేడు జూన్ 21 న, జరుగనున్న నీట్–2026 పరీక్ష పకడ్బందీగా నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. పరీక్షా కేంద్రం గేట్ లు మధ్యాహ్నం 1.30 గంటల

- మిగతా 2లో..

# చదువుతోనే ఉజ్వల భవిష్యత్‌కు బాటలు






మొదటి పేజీ తరువాయి

పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక స్థాయిలో పొందిన విద్య ఉన్నత విద్యకు పునాదని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థినులు చదువుపై శ్రద్ధ పెట్టి మంచి మార్కులతో ఉత్తీర్ణులు అవుతున్నారు. విద్యార్థినీలు బాగా చదవాలని, వారి చదువు ఒక తరం అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. విద్య రంగం అభివృద్ధితో రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులు ఆటలతో పాటు చదువు నిర్లక్ష్యం చేయవద్దన్నారు. తమకు నైపుణ్యం ఉన్న రంగంలో కృషి చేసి ఉన్నత స్థానంకు ఎదగాలని సూచించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉ ండాలన్నారు. గురుకుల పాఠశాల విద్యార్థులు ఐ. ఏ ఎస్., ఐ.పి.ఎస్ లాంటి ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు. చదువుతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యమన్నారు. గురుకుల పాఠశాలలో పౌష్టిక ఆహారం అందించాలన్నారు. ఈ ప్రాంత అభివృధికి విద్య రంగం అభివృద్ధి కృషి చేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిని ఆయన అభినందించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో మైనారిటీ పాఠశాలలు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నడవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని ఆరోపించారు. గతంలో గురుకుల పాఠశాలలకు 60:40 నిష్పత్తిలో నిధులు మంజూరు చేసినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను పూర్తిగా వినియోగించలేదని ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రి చొరవతో కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపించి నిధులు విడుదల చేయించామని తెలిపారు. ముఖ్యమంత్రి కృషితో ఈ పాఠశాల నిర్మాణం సాధ్యమైందని పేర్కొన్నారు. ఇంకా రెండు భవనాలు త్వరలో పూర్తవుతాయని తెలిపారు. "మాటలతో కాదు పనితో చూపించాలి" అనే సిద్ధాంతంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. తెలంగాణ అభివృద్ధి దిశగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంతో పాటు మహబూబ్ నగర్‌లో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా యువతకు ఆధునిక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. టాటా వంటి ప్రాజెక్టుల ద్వారా సుమారు 25,000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. అందులో 25 శాతం మైనారిటీ యువతకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. గత రెండున్నర సంవత్సరాలలో మహబూబ్ నగర్ అభివృద్ధికి రూ. 2000 కోట్ల నిధులు తీసుకువచ్చామని వెల్లడించారు. ×××, లా, ఇంజనీరింగ్ కళాశాలలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, రోడ్లు, శాశ్వత తాగునీటి వంటి మౌలిక సదు-పాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. వచ్చే 10 సంవత్సరాల్లో మహబూబ్ నగరాన్ని అగ్రగామి పట్టణంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. మహబూబ్ నగరం అన్ని మతాల ప్రజల సొంతమని, ఐక్యతే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం రేషన్ కార్డులు, ఆరోగ్య బీమా వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణం ద్వారా 40 లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, దీనిని అడ్డుకునే విధంగా బిఆర్ఎస్ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. నాడు స్థాపించిన హైటెక్ సిటీ వలన సుమారు 20 లక్షల మందికి అన్నం పెడుతుందని ఆయన చెప్పారు. తెలంగాణ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉ ందని పేర్కొన్నారు. మహబూబ్ నగర్ ఎం.పి.డి. కె అరుణ మాట్లాడుతూ విద్యా ప్రమాణాల పెంపు, విద్యా మౌలిక సదు-పాయాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని విధాలా సహకరిస్తోందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా ముస్లింలు సహా అన్ని మైనారిటీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉ ందన్నారు. మైనారిటీ విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని ఆమె సూచించారు. కేంద్ర ప్రభుత్వ వాటా నిధులు, సమకూర్చేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 28 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమైన మైనారిటీ పాఠశాలకు ప్రహరీ గోడతో పాటు మరికొన్ని మౌలిక సదుపాయాల కోసం అదనపు నిధులు అవసరమని పేర్కొంటూ, వాటి కోసం నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మహబూబ్‌నగర్‌లో మరో రెండు మైనారిటీ పాఠశాలల ఏర్పాటు ప్రతిపాదనలో ఉ ందని, వాటికి కూడా కేంద్ర ప్రభుత్వ వాటా నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి, ఉన్నత లక్ష్యాలను సాధించేలా మార్గనిర్దేశం చేయాలని ఆమె కోరారు. మహబూబ్ నగర్ చుట్టూ జాతీయ రహదారులు ఉండటంతో మహబూబ్‌నగర్ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా మారుతోందని తెలిపారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా పనిచేయాలన్నారు. పాలమూరు ప్రాంత సమగ్ర అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఎంపీ డీకే అరుణ హామీ ఇచ్చారు. జిల్లా అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ నిధులు తీసుకురావడంలో నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ,రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ గురుకుల విద్యా సంస్థ ల సొసైటీ వైస్ చైర్మన్ అండ్ ప్రెసిడెంట్ ఫహీం ఖురేషి ,జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా,మేయర్ జి.మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి షఫియుల్లా, మార్కెట్ కమిటీ చైర్మన్ అనితా మధుసూదన్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్,. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివానిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.







# నేటి నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

మొదటి పేజీ తరువాయి

తర్వాత మూసివేత ఉంటుందన్నారు. నీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఆర్ టి.సి.బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించబడిందని తెలిపారు. అభ్యర్థులు జూన్ 21 న. పరీక్ష కు జారీ చేసిన అడ్మిట్ కార్డ్ ను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. అదేవిధంగా సెల్ ఫోన్ లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ తీసుకురావటానికి అనుమతి లేదని స్పష్టం వ్యక్తం చేశారు. తధానంతరం నీట్ పరీక్ష నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్ నిర్వహించారు. జూన్ 21 న, నీట్ పరీక్ష నిర్వహణ నేపథ్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, జిల్లా ఎస్.పి డి.జానకి తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పరీక్షల నిర్వహణలో భాగంగా సంబంధిత శాఖల అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. రవాణా శాఖ అధికారులు విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా తగిన రవాణా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో 13 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 4291 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. విద్యార్థులందరికీ ఆర్టీసీ రవాణా శాఖ తరపున ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించబడినట్లు తెలిపారు. విద్యాశాఖ, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి పరీక్షల సజావు నిర్వహణకు సహకరించాలని సూచించారు. అలాగే పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా, ఎటువంటి అంతరాయాలు కలగకుండా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు నిర్ణీత సమయానికి ముందుగానే చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ హాల్ టికెట్/అడ్మిట్ కార్డ్‌లో పొందుపరిచిన అన్ని సూచనలు తప్పనిసరిగా చదివి, అందులో పేర్కొన్న నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:15 గంటల వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. పరీక్ష రోజున ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాకుండా అభ్యర్థులు ఒక రోజు ముందుగానే తమ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి లొకేషన్ తెలుసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో ఉన్న జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు, బుక్ స్టాల్లు/బుక్ సెంటర్లు పరీక్ష సమయాల్లో మూసివేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులు తప్పనిసరిగా అడ్మిట్ కార్డు, హాల్ టికెట్ చెల్లుబాటు అయ్యే ఒరిజినల్ ఫోటో ఐడీ ప్రూఫ్ వెంట తీసుకురావాలని తెలిపారు. వీటి పరిశీలన లేకుండా ఏ అభ్యర్థినీ పరీక్షా కేంద్రంలోకి అనుమతించరని స్పష్టం చేశారు. (ఎన్‌టీఏ) వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్ కార్డులో కేటాయించిన స్థలంలో పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను అతికించి తీసుకురావాలని సూచించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి కనీసం 2 గంటల ముందుగానే చేరుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు. 1:30 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరినీ అనుమతించరని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అభ్యర్థులు సాధారణ దుస్తుల్లో రావాలన్నారు. ముఖ్యంగా మహిళా అభ్యర్థులు సహా ఎవ్వరూ ఆభరణాలు, మెటల్ వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు ధరించకూడదని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో మెటల్ డిటెక్టర్ ద్వారా తనిఖీలు (Frisking) నిర్వహించబడతాయని చెప్పారు. పరీక్షా కేంద్రాలలో ప్రవేశ సమయంలో బయోమెట్రిక్ హాజరు నమోదు ఫేస్ వెరిఫికేషన్ల స్కానింగ్, భద్రతా తనిఖీలు తప్పనిసరిగా నిర్వహించబడతాయని తెలిపారు. అభ్యర్థులు మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, పుస్తకాలు, నోట్స్, స్టడీ మెటీరియల్ వంటి నిషేధిత వస్తువులు తీసుకురాకూడదని ముందస్తుగా తెలిపారు. అదేవిధంగా, PwBD (Persons with Benchmark Disabilities) కేటగిరీకి చెందిన అభ్యర్థులు లేదా ఎన్‌టిఏ NTA నిబంధనల ప్రకారం స్క్రైబ్ (Scribe) సౌకర్యం పొందే అభ్యర్థులకు పరీక్ష సమయానికి అదనంగా 1 గంట సమయం (Compensatory Time) కల్పించబడుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, డి.ఆర్.ఓ. ఏ.నిర్మల, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్, నోడల్ అధికారి సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనం భావితరాలకు వరప్రదాయిని

**జిల్లాలో ఘనంగా ప్రారంభమైన వన మహోత్సవం కార్యక్రమం**

**రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు**




ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 20 (మనం బ్యూరో) : నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. నాగర్ కర్నూల్ పట్టణంలోని ఇందిరా మహిళ శక్తి భవన సమీపంలో గల ప్రభుత్వ స్థలంలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొక్కలను నాటిన రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి, నాగర్ కర్నూల్ శాసనసభ్యుడు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి , అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సురేంద్రలు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు. అనంతరం ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూపెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, భూగర్భ జలాల క్షీణత వంటి సమస్యలను ఎదుర్కోవాలంటే విస్తృత స్థాయిలో వృక్షారోపణ చేపట్టడం అత్యంత అవసరమన్నారు. మొక్కలు మన జీవితానికి ఆధారం అని, అవి ఆక్సిజన్‌ను అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పచ్చదనాన్ని పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. వాటిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు. మొక్కలు నాటడం ఒక మంచి కార్యక్రమమే అయినప్పటికీ, వాటిని సంరక్షించి పెద్ద చెట్లుగా పెంచినప్పుడే ఆ కార్యక్రమానికి నిజమైన ఫలితం దక్కుతుందన్నారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని తన కుటుంబ సభ్యుడిలా సంరక్షించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం దేశంలోనే పచ్చదనం పెంపులో ఆదర్శంగా నిలిచిందని, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల ఫలితంగా అటవీ విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని తెలిపారు. భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అందించాలంటే చెట్ల పెంపకాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ ప్రకృతి సంపదను పరిరక్షించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పచ్చదనం పెంపు కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ సమతుల్యతతో పాటు గ్రామాలు, పట్టణాల సౌందర్యం కూడా పెరుగుతుందని తెలిపారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద, కార్యాలయాల వద్ద మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లాలో ఈ సంవత్సరం మన మహోత్సవ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 35 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన మొక్కల లక్ష్యాలను చేరుకోవాలని పచ్చదనం, పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు, జిల్లాలో వృక్షారోపణ లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా ప్రత్యేక చర్యలు







తీసుకుంటున్నామని చెప్పారు. తదనంతరం వనమహోత్సవపు కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సురేంద్ర, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, అదనపు కలెక్టర్ అమరేందర్, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, వివిధ శాఖల అధికారులతో పాటు తదితర అధికారులు, పాల్గొన్నారు.

---

మొదటి పేజీ తరువాయి

# యోగాతో ఏకాగ్రత పెరుగుతుంది

ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ యోగా ఆసనాలు, ధ్యాన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా పాలమూరు విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కె. ప్రవీణ హాజరయ్యారు. గౌరవ అతిథిగా అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. చంద్ర కిరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి యోగా ఆసనాలు నిర్వహించి, యోగా ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. ప్రవీణ మాట్లాడుతూ యోగా మరియు మెడిటేషన్ విద్యార్థుల జీవితంలో ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని అన్నారు. యోగా సాధన ద్వారా మానసిక ప్రశాంతత పెరగడంతో పాటు చదువుపై ఏకాగ్రత మెరుగుపడి, నేర్చుకున్న పాఠ్యాంశాలను ఎక్కువ కాలం గుర్తుంచుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి విద్యార్థి తన రోజువారీ జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకుంటే ఉత్సాహంగా, ఆరోగ్యంగా తన లక్ష్యాలను సాధించగలరని అన్నారు. డాక్టర్ ఎన్. చంద్ర కిరణ్ మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో మనిషి జీవన విధానం ఎంతో వేగవంతంగా మారిందని, బిజీ షెడ్యూల్ కారణంగా శారీరక మరియు మానసిక ఒత్తిడి పెరుగుతున్న పరిస్థితుల్లో యోగా ఎంతో అవసరమని పేర్కొన్నారు. యోగా ద్వారా శరీరం, మనస్సు మరియు శ్వాసపై నియంత్రణ సాధించవచ్చని, తద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని కొనసాగించవచ్చని అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో అత్యధిక మెజార్టీతో జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ఆమోదించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. జూన్ 21వ తేదీ సంవత్సరంలో అత్యంత ఎక్కువ పగటి మరియు రాత్రి సమయం కలిగిన రోజుగా ఉండటం వల్ల ఆ రోజును ఎంపిక చేయడం జరిగిందని వివరించారు. భారతదేశంలో యోగా సాధనకు వేల సంవత్సరాల చరిత్ర ఉందని, ప్రాచీన కాలం నుంచి ఋషులు, మునులు యోగా, ధ్యానం ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించారని తెలిపారు. శ్వాస నియంత్రణ, ధ్యానం ద్వారా మనిషి శారీరకంగా మరియు మానసికంగా ఆరోగ్యం తో పాటు ఎక్కువ కాలం జీవించగలరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎస్. రవికుమార్, డాక్టర్ ఎం. గాలెన్న, డాక్టర్ ఎం. జ్ఞానేశ్వర్, డాక్టర్ చిన్న దేవి, డాక్టర్ ఏ. ఈశ్వర్ కుమార్, మాజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వి. విజయభాస్కర్, డాక్టర్ కె. రామ్మోహన్, నాన్ టీచింగ్ స్టాఫ్ ప్రెసిడెంట్ రామ్మోహన్ జి., ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కోఆర్డినేట్ పి. పవన్ కుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. వివిధ విభాగాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.







## భక్తి శ్రద్ధలతో శ్రీ శనేశ్వర స్వామికి
# తిలతైల అభిషేక పూజలు

ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 20 (మనం బ్యూరో) : శ్రీ పరాభవ నామ సంవత్సరం నిజ జేష్ఠ మాసం షష్టి శనివారం, మఖ నక్షత్రము రోజున బీజినేపల్లి మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో గల శ్రీ శనేశ్వర స్వామికి భక్తులచే శని గ్రహదోష నివారణకు స్వామివారికి తిలతైల అభిషేకలు భక్తితో వేదమంత్రచరణల మధ్య జరిగాయి. శ్రీసార్ధాసప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామికి శనివారం ప్రత్యేకంగా తిలతైల అభిషేకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమ-ఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ... ఈ మాసంలో స్వామివారిని కొలిచిన అత్యధిక సంతృప్తి పొంది విశేష ఫలితాన్ని భక్తులకు ఇస్తారనన్నారు. ప్రతి ఒక్కరు జన్మ రిత్యా, గోచార రీత్యా, శనిగ్రహ దోష నివారణకు స్వామివారిని శక్తిమేరకు పూజించాలన్నారు. ఈ ఆలయంలో గోన బుద్ధారెడ్డి కాలంనాటి బ్రహ్మసూత్రం గల పరమశివునికి భక్తులచే రుద్రాభిషేక పూజలు, అర్చనలు, దీపారాధన నందీశ్వర స్వామి వారికి ప్రత్యేక అర్చనపూజలు భక్తులచే నిర్వహించారు. అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు. ఈకార్యక్రమం లో ఆలయ ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు, గ్రామ సర్పంచ్ టి.సుగుణమ్మ, కమిటీ సభ్యులు కెంచె రాజేష్, ప్రభాకరచారి, పుల్లయ్య, అడ్వకేట్ వీర శేఖర్ చారి, శ్రీకాంత్ రెడ్డి, ఆలయ అర్చకులు శాంతి కుమార్, ఉమమహేశ్వర్, సిబ్బంది గోపాల్ రెడ్డి భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

# చిన్నారుల ఆనందకర బాల్యానికి కృషి చేయాలి

**పిల్లలపై జరిగే శారీరక, మానసిక, లైంగిక వేధింపులను ప్రతి ఒక్కరు అరికట్టాలి : చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు రాజేంద్ర**

ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 20 (మనం బ్యూరో) : చిన్నారులపై జరిగే వివిధ రకాల అఘాయిత్యాలను నివారించేందుకు వారి ఆనందకరమైన బాల్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు రాజేంద్ర అన్నారు. గద్వాల మండలంలోని గోనుపాడు గ్రామం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో "పిల్లలపై నేరాల నివారణ" అంశంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పిల్లలపై జరిగే శారీరక, మానసిక, లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలల హక్కులను పరిరక్షించడం సమాజంలోని ప్రతి పౌరుడి బాధ్యతని పేర్కొన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా వంటి సమస్యలు పిల్లల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని వివరించారు. అదే విధంగా పోక్సో చట్టం గురించి అవగాహన కల్పిస్తూ, పిల్లలపై లైంగిక నేరాలకు పాల్పడిన వారికి కఠినమైన శిక్షలు విధించబడతాయని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంరక్షకులు పిల్లల ప్రవర్తనలో మార్పులను గమనించి, ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. పిల్లలు తమకు ఎదురయ్యే సమస్యలు, వేధింపులు, ప్రమాదకర పరిస్థితులకు భయపడకుండా పెద్దలకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వం అందుబాటులో ఉంచిన సహాయ వ్యవస్థలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అత్యవసర పరిస్థితుల్లో వినియోగించాల్సిన 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్), 100 (పోలీస్ అత్యవసర సేవలు) అదేవిధంగా 15100 హెల్ప్‌లైన్ నంబర్ల గురించి విద్యార్థులు, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యుడు శ్రీనివాసులు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు లక్ష్మన్న స్వామి, విద్యా శాఖ, భరోసా, సఖి సెంటర్ కోఆర్డినేటర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర పౌర సరఫరాల అధికారుల బృందం ఆకస్మిక తనిఖీలు

**పాఠశాలలు, కళాశాలలు, రేషన్ దుకాణాలు తనిఖీ లు**



మహబూబ్ నగర్, 20జూన్, (మనం న్యూస్) : రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్, హైదరాబాద్ ఆదేశాల మేరకు రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ కార్యాలయం లో పని చేస్తున్న ఈ. భాస్కర్ రావు, జనరల్ మేనేజర్ (అడ్మినిస్ట్రేషన్), రహ్మాన్, టెక్నికల్ అసిస్టెంట్, సంతోష్, ఈటీఎఫ్ లతో కూడిన అధికారుల బృందం, జిల్లా మేనేజర్ పౌర సరఫరాల సంస్థ అధికారి ఎ. రవి నాయక్, డిప్యూటీ తహసీల్దార్ (ఎన్‌ఫోర్స్ మెంట్) రాజీవ్ రెడ్డి, దేవరకద్ర ఎంఎల్ ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్ అండ్ డిప్యూటీ తహసీల్దార్ ఇమ్తియాజుద్దీన్‌లతో కలిసి శనివారం మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బీసీ బాలికల కళాశాల వసతి గృహం, రేషన్ షాప్ నెం.13తో పాటు దేవరకద్ర మండలం లోని కేజీబీవీ పాఠశాల, అమ్మాపూర్, రేషన్ షాప్ నెం.9లను ఆకస్మికంగా తనిఖీ లు నిర్వహించారు. ఈ సందర్భంగా సరఫరా అవుతున్న బియ్యం నాణ్యతను పరిశీలించేందుకు బియ్యం నమూనాలను సేకరించారు. తనిఖీ బృందం విద్యార్థులు మరియు లబ్దిదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకుంది. విద్యార్థులు ప్రభుత్వం సరఫరా చేస్తున్న స్టీమ్ రైస్ నాణ్యత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. స్టీమ్ రైస్ వండటానికి అనుకూలంగా ఉండటంతో పాటు రుచికరంగా ఉండి ఎలాంటి వృథా లేకుండా వినియోగిస్తున్నామని తెలిపారు. అందువల్ల ముడి బియ్యం (రా రైస్)కు బదులుగా ప్రస్తుతం సరఫరా చేస్తున్న స్టీమ్ రైస్‌ను కొనసాగించాలని వారు కోరారు.రాష్ట్రంలోని పాఠశాలలు, వసతి గృహాలకు నాణ్యమైన స్టీమ్ రైస్‌ను సరఫరా చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విద్యార్థులు మరియు లబ్దిదారులు కృతజ్ఞతలు తెలిపారు. సరఫరా అవుతున్న బియ్యం నాణ్యతపై లబ్దిదారుల నుంచి సానుకూల స్పందన లభించినట్లు తనిఖీ బృందం పేర్కొంది.

# బ్యాంకాక్ బరిలో వనపర్తి వీరుడు!

**అంతర్జాతీయ టైక్వాండో పోటీల్లో రెండు స్వర్ణాలు, ఒక కాంస్యం**

**భారత ఖ్యాతిని చాటిన సానే వినోద్ కుమార్ రెడ్డి**



వనపర్తి, జూన్ 20 (మనం న్యూస్) : అంతర్జాతీయ క్రీడా వేదికపై వనపర్తి యు-వకుడు తన ప్రతిభను చాటుతూ దేశానికి గర్వకారణంగా నిలిచాడు. వనపర్తి మండలం సవాయిగూడెం గ్రామానికి చెందిన సానే వినోద్ కుమార్ రెడ్డి ఇటీవల థాయ్ లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో నిర్వహించిన అంతర్జాతీయ టైక్వాండో పోటీల్లో అద్భుత ప్రదర్శన కనబరిచి రెండు స్వర్ణ పతకాలు, ఒక కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ప్రపంచ నలుమూలల నుంచి పాల్గొన్న ప్రతిభావంతులైన క్రీడాకారులతో పోటీ పడుతూ వినోద్ కుమార్ రెడ్డి తన నైపుణ్యం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో విజేతగా నిలవడం విశేషం. ఆయన సాధించిన ఈ ఘనతతో వనపర్తి జిల్లా పేరు అంతర్జాతీయ స్థాయిలో మార్మోగింది. భారత త్రివర్ణ పతాకాన్ని విదేశీ గడ్డపై రెపరెపలాడించి దేశ కీర్తిని ఇనుమడింపజేశాడు. ఫాదర్స్ డే సందర్భంగా ఈ విజయాన్ని తన తండ్రి సానే కిచ్చా రెడ్డికి అంకితం చేస్తున్నట్లు వినోద్ కుమార్ రెడ్డి తెలిపారు. తన క్రీడా ప్రయాణంలో తండ్రి అందించిన ప్రోత్సాహం, మద్దతే విజయాలకు పునాదిగా నిలిచిందన్నారు. యువత లక్ష్యసాధనకు కృషి, పట్టుదల, క్రమశిక్షణే ప్రధాన ఆయుధాలని, నిరంతర సాధనతో అంతర్జాతీయ స్థాయిలోనూ విజయాలు అందుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. వినోద్ కుమార్ రెడ్డి సాధించిన విజయంపై క్రీడాభిమానులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంత యువతకు ఆయన ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

# ఎమ్మెల్యే తనయుడి మాస్టర్స్ డిగ్రీ పూర్తి

**యూరప్ లోని బిజినెస్ స్కూల్ లో డ్యూయల్ మాస్టర్ డిగ్రీ విజయవంతం**

**నవనీత్ రెడ్డికి అభినందనల వెల్లువ కురిపించిన అభిమానులు, కాంగ్రెస్ శ్రేణులు**




వనపర్తి జూన్ 20 (మనం ప్రతినిధి) : వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి శారద దంపతుల ముద్దుల కుమారుడు నవనీత్ రెడ్డి యూరప్ లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసుకున్నాడు. మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పట్టాను ఫ్రాన్స్ లో, మాస్టర్ ఆఫ్ సైన్స్ పట్టాను జర్మనీలో ఏకకాలంలో పూర్తిచేసుకుని రెండు దేశాల్లోని విద్యా ప్రమాణాలను సమర్థవంతంగా అధిగమిస్తూ ఘనత సాధించారు. తమ కుమారుడు ఏకకాలంలో డ్యూయల్ కోర్సులు చదివి ఉత్తమ విద్యావంతుడుగా మాస్టర్స్ డిగ్రీలు అందుకోవడంతో ఎమ్మెల్యే మేఘారెడ్డి శారద దంపతుల సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. శనివారం యూరప్ లో జరిగిన మాస్టర్స్ డిగ్రీ పట్టా ప్రధానోత్సవంలో వారు పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే నవనీత్ రెడ్డి డ్యూయల్ కోర్సులు ఏకకాలంలో పూర్తిచేసుకుని రెండు పట్టాలు అందుకో వడంతో వనపర్తి నియోజకవర్గంలోని వారి అభిమానులు, బంధుమిత్రులు, కాంగ్రెస్ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు వెల్లువ కురిపించారు. నవనీత్ రెడ్డి సోదరుడు మనోజ్ రెడ్డి పాల్గొన్నారు.



## రాజీ మార్గంలో కేసుల పరిష్కారం ఉత్తమం


### అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి రవికుమార్

ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 20 (మనం బ్యూరో) : ఏళ్లుగా పరిష్కారం కానీ వివిధ రకాల కేసుల్లో ఇబ్బందులు పడుతున్న కక్షిదారులకు రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడమే ఉత్తమ మార్గమని మొదటి అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి రవికుమార్ పేర్కొన్నారు. గద్వాల కోర్టు ఆవరణలో శనివారం హైకోర్టు, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... కోర్టుల్లో సంవత్సరాల తరబడి పెండింగ్ లో ఉన్న కేసులను పరస్పర రాజీ ద్వారా త్వరితగతిన పరిష్కరించేందుకు లోక్ అదాలత్ ఒక సమర్థవంతమైన వేదికగా పనిచేస్తోందన్నారు. కక్షిదారులు సమయం, ధనం, శ్రమను ఆదా చేసుకోవడంతో పాటు దీర్ఘకాలిక న్యాయ వివాదాలకు ముగింపు పలికి ప్రశాంతమైన జీవితం గడపడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పాత కేసులు పరిష్కారం కావడం ద్వారా న్యాయ వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. అనేక సంవత్సరాలుగా వివిధ కారణాల వల్ల విచారణ కొనసాగుతున్న కేసులు కూడా లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం పొందుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా మోటార్ ప్రమాద పరిహార కేసులు, బ్యాంకు రుణాల వసూళ్ల కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, కుటుంబ వివాదాలు, తదితర సంబంధించి జిల్లా వ్యాప్తంగా మొత్తం 7046 కేసులను పరిష్కరించినట్లు వివరించారు. భవిష్యత్తులో కూడా ప్రజలు రాజీ కాగల కేసులను లోక్ అదాలత్ లో పరిష్కరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వెంకటేష్ దుర్గా, అడ్వకేట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహులు, న్యాయవాదుల బృందం, సీఐలు, ఎస్సైలు, పోలీసు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## సతీష్ యాదవ్‌కు ఏపీజే అబ్దుల్ కలాం లైఫ్ టైం అచీవ్ మెంట్ అవార్డు

వనపర్తి జూన్ 20 (మనం ప్రతినిధి) : అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు డాక్టర్ సతీష్ యాదవ్ కు ఏపీజే అబ్దుల్ కలాం లైఫ్ టైం అచీవ్ మెంట్ అవార్డు దక్కింది. పలు విభాగాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి శాలువాలతో సన్మానాలు చేస్తూ తల్లిదండ్రులు లేని పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తూ అవగాహన కల్పిస్తున్న ఆయన తమిళనాడు రాష్ట్రంలోని ఊటీలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు అందుకున్నారు. గతంలోని వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేస్తుండడంతో ఆయనకు డాక్టరేట్ కూడా వచ్చింది. ఈ సందర్భంగా వనపర్తి లో ఆయన అభిమానులు ఆయనకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన చీఫ్ జడ్జ్ డాక్టర్ ప్రభు రంగరాజన్, డాక్టర్ జార్జ్ పీటర్, యుఎన్ఐపిసి సంస్థ కోఆర్డినేటర్ డాక్టర్ కిమ్, ఉమ్మడి పాలమూరు జిల్లా మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ మల్లారెడ్డి, ఉబ్బలి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.




## శాఖల మధ్య సమన్వయ లోపం.. తరచూ విద్యుత్‌కు అంతరాయం

**గత ప్రభుత్వ హయాంలో కరెంటు తీగలు కిందే అవెన్యూ ప్లాంటేషన్**

**వృక్షాలుగా పెరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్న చెట్ల కొమ్మలు**

**చెట్లను తొలగిస్తే కేసులు పెడతామంటూ ఫారెస్ట్ అధికారుల హెచ్చరికలు**

**చెట్లు తొలగించకుంటే తరచూ విద్యుత్ సరఫరాకు ఆటంకం అంటూ విద్యుత్ శాఖ అధికారుల మొర**

**తరచూ కరెంటు కోతలతో గగ్గోలు పెడుతున్న ప్రజానీకం**

**చిట్యాల రోడ్డులో అవెన్యూ ప్లాంటేషన్ పరిశీలించి అధికారులకు సూచనలు చేసిన మునిసిపల్ చైర్మన్ మాధవి రమేష్**



వనపర్తి జూన్ 20 (మనం ప్రతినిధి) : గత ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టిన హరితహారం మొక్కలు నేడు వృక్షాలుగా మారాయి. కానీ శాఖల సమన్వయ లోపంతో తరచూ విద్యుత్ అంతరాయానికి విఘాతం కలుగుతోంది. అవెన్యూ ప్లాంటేషన్ చేసిన తొలి నాళ్లలో ఫారెస్ట్, మునిసిపల్, విద్యుత్, పంచాయతీరాజ్, రహదారులు, భవనాల శాఖ అధికారులు సమన్వయంతో నిర్ణయం తీసుకొని భవిష్యత్తు తరాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా మొక్కలు నాటాల్సి ఉండేది. కానీ వంతుకు గంతు వేసే చందంగా ఎవరికి వారు మొక్కలు ఇచ్చామా.. నాటామా అనే రీతిలో ముందుకు సాగడంతో కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టిన హరితహారం లక్ష్యం నీరుగారిపోతుంది. ఫారెస్ట్ అధికారులు నర్సరీలలో మొక్కలు పెంచి వర్షాకాల ప్రారంభ సీజన్ లో మునిసిపల్ అధికారులకు అందజేశారు. వారు కరెంటు తీగల కింద మొక్కలు నాటి మమ అనిపించారు. భవిష్యత్తులో రోడ్ల విస్తరణ జరిగితే కోట్లాది వ్యయంతో నాటిన మొక్కలు తీసేయాల్సి ఉంటుందన్న సోయి లేకుండా ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోలేదు. కరెంటు తీగల కింద మొక్కలు నాటితే అవి వృక్షాలుగా మారిన తర్వాత తీగలకు తగిలి తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్న సోయి ఎలక్ట్రిసిటీ అధికారులకు కూడా లేకపోవడంతో వృక్షాలుగా మారిన చెట్లను నేడు తొలగించాల్సి వస్తోంది. ఇటీవల చిన్నపాటి వర్షాలకే తరచూ కరెంటు తీగలకు చెట్ల కొమ్మలు తగిలి బ్రేక్ డౌన్ కావడం వల్ల విద్యుత్తులో అంతరాయం కలుగుతుంది. ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతున్న అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను తొలగించాల్సి వస్తుండడంతో ఫారెస్ట్ అధికారులు అడ్డు చెబుతున్నారు. చెట్లను నరికితే కేసులు నమోదు చేస్తామంటూ మునిసిపల్, విద్యుత్ శాఖ అధికారులకు హెచ్చరికలు జారీ చేస్తుండడంతో కరవమంటే కప్పకు కోపం, మింగమంటే పాముకు కోపం అన్న చందంగా తయారైంది. చిన్నపాటి గాలివానకే విద్యుత్ బ్రేక్ డౌన్ అవుతుండడంతో విద్యుత్ శాఖ అధికారులు కరెంటు తీగలు కింద ఉండే చెట్ల కొమ్మలను తొలగించే పనికి ఉపక్రమించారు. చెట్లను తొలగించే సమయంలో అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేసే సమయాన్ని ప్రజలకు ముందుగానే తెలిపి పనులకు ఉపక్రమిస్తున్నప్పటికీ ప్రతిపక్ష పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా గ్లోబల్ ప్రచారానికి దిగుతుండడంతో శనివారం మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్ రంగంలోకి దిగారు. చిట్యాల రోడ్డులో గల అవెన్యూ ప్లాంటేషన్ పరిశీలించి విస్మయం వ్యక్తం చేశారు. గత పాలకులు ఏమాత్రం భవిష్యత్తు ఆలోచన లేకుండా కరెంటు తీగల కింద మొక్కలను నాటడం వల్ల నేడు తీగలకు తగిలి విద్యుత్తులో అంతరాయం కలుగుతుందని దానిని సరి చేసే క్రమంలో రెండు మూడు గంటలు కరెంటు సరఫరాను నిలిపివేస్తే ప్రతిపక్ష పార్టీలు గగ్గోలు పెడుతున్నాయని విమర్శించారు. ఒకటి రెండు రోజుల్లో వనపర్తి పట్టణంలో తీగల కింద ఉన్న చెట్లను తొలగించి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆమె సూచించారు.

## మండల పరిషత్ అధికారులకు సన్మానం



మగనూరు జూన్ 20(మనం న్యూస్) : మాగనూర్ మండలంలో ఎంపీడీఓ ఆఫీస్ లో పనిచేస్తునటువంటి టైపిస్ట్ రాజేశ్వరి నారాయణపేట జిల్లా పరిషత్ కు,అదేవిదంగా ఎంపీడీఓ ఆఫీస్ లో పనిచేస్తున్న ఆఫీస్ సభర్డినేట్ ప్రకాష్ గౌడ్ మాగనూర్ మండలం జిల్లాపరిషద్ హై స్కూల్ కు బదిలీ కావడం వలన సన్మాన కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకుడు ఆనందగౌడ్, ఎంపీడీఓ శ్రీనివాసు లు మరియు పంచాయతీ సెక్రటరీ లు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన అందించాలి**

**జోగులాంబ గద్వాల అదనపు కలెక్టర్ నర్సింగరావు**

ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 20 (మనం బ్యూరో) : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న అన్ని సౌకర్యాలతో పాటు వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన అందించాలని జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు అన్నారు. శనివారం మల్దకల్ మండలంలోని కేజీబీవీ పాఠశాలను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,...రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలలో కల్పిస్తున్న సౌకర్యాలను తెలియజేసి విద్యార్థుల నమోదు శాతం పెంచే విధంగా అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు.



ప్రతిరోజు పాఠశాలల్లో పారిశుధ్యం పనులు పక్కాగా నిర్వహించాలన్నారు. వసతి గృహంలో మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారం అందించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం,భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. తాగునీరు, పారిశుద్ధ్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థుల హాజరు, వారి విద్యా సామర్థ్యాలను నిరంతరం పర్యవేక్షిస్తూ వారికి నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత, పరిశుభ్రత విద్యా ప్రమాణాలను స్వయంగా దగ్గరుండి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, కేజీబీవీ ఎస్ఓ, సిబ్బంది పాల్గొన్నారు.

# యోగా ఆరోగ్యానికి రాజమార్గం

## ప్రపంచానికి యోగాను అందించిన ఘనత భారతదేశానిదే

**పలుస శంకర్ గౌడ్**



వనపర్తి, జూన్ 20 (మనం న్యూస్) : ప్రపంచ మానవాళికి యోగ విద్యను పరిచయం చేసి ఆరోగ్యకర జీవన విధానానికి మార్గం చూపిన ఘనత భారతదేశానిదేనని వనపర్తి జిల్లా సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ పేర్కొన్నారు. నేడు నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన శుభాకాంక్షలు తెలిపారు.యోగ అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, శరీరం, మనసు, ఆత్మల మధ్య సమతుల్యతను నెలకొల్పే మహోన్నత భారతీయ సంప్రదాయమని చెప్పారు. వేల ఏళ్ల క్రితమే భారతీయ ఋషులు యోగ శాస్త్రాన్ని ప్రపంచానికి అందించారని గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపాదనతో 2015 నుంచి ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. నిత్యం యోగా సాధన చేయడం వల్ల శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తాయని పేర్కొన్నారు. ప్రాణాయామం ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుందని చెప్పారు. ధ్యానం ద్వారా ఏకాగ్రత పెరిగి ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలు దూరమవుతాయని వివరించారు. బీపీ, మధుమేహం, ఊబకాయం వంటి జీవనశైలి వ్యాధులను నియంత్రించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విద్యార్థులకు జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరగడంతో పాటు వృద్ధులకు కండరాల బలం, శారీరక సమతుల్యతను మెరుగుపరుస్తుందని చెప్పారు. మహిళల ఆరోగ్య సంరక్షణలో కూడా యోగా ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. తాడాసనం, వృక్షాసనం, భుజంగాసనం, పద్మాసనం వంటి ఆసనాలు, అనులోమ విలోమ, కపాలభాతి, భస్త్రిక వంటి ప్రాణాయామాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వివరించారు. యోగా సాధనకు ఖరీదైన పరికరాలు అవసరం లేదని, ప్రతిరోజూ కొద్దిసేపు క్రమం తప్పకుండా సాధన చేస్తే ఆరోగ్యవంతమైన జీవితం సొంతమవుతుందని తెలిపారు. ప్రపంచ దేశాలన్నీ యోగాను ఆదరిస్తుండటం ప్రతి భారతీయుడికి గర్వకారణమని పేర్కొన్న పలుస శంకర్ గౌడ్, ఈ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని పిలుపునిచ్చారు. "యోగం చేయండి.ఆరోగ్యాన్ని కాపాడుకోండి" అంటూ జిల్లా ప్రజలకు అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రతి ఇంటా ఒక మొక్క.. పచ్చని వనపర్తే లక్ష్యం

## వన మహోత్సవం విజయవంతానికి ప్రజల భాగస్వామ్యం అవసరం

**ఖానాయపల్లి, అమడబాకుల గ్రామాల్లో మొక్కలు నాటిన అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**



వనపర్తి, జూన్ 20 (మనం న్యూస్) : రాష్ట్రాన్ని పచ్చదనంతో నింపాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ పిలుపునిచ్చారు. శనివారం కొత్తకోట మండలం కానాయపల్లి, అమడబాకుల గ్రామపంచాయతీల్లో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తన వంతు సందేశాన్ని అందించారు. పచ్చదనం పెంపు ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, నర్సరీలను సందర్శించిన అదనపు కలెక్టర్ పాఠశాలల నిర్వహణ తీరును సమీక్షించారు. రికార్డులు, హాజరు పట్టికలను పరిశీలించి విద్యార్థుల హాజరు శాతాన్ని మరింత పెంచేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ వారి విద్యాభ్యాసం, పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కల నిర్వహణ, సంరక్షణపై అధికారులను ప్రశ్నించిన ఆయన నాణ్యమైన మొక్కలను పెంచి గ్రామాల్లో విస్తృతంగా నాటేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వన మహోత్సవం కేవలం మొక్కలు నాటే కార్యక్రమం మాత్రమే కాదని, వాటిని పరిరక్షించి పెద్ద చెట్లుగా తీర్చిదిద్దడమే అసలు లక్ష్యమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షిస్తే రాష్ట్రం మరింత పచ్చదనంతో కళకళలాడుతుందని ఆయన అన్నారు. డీఆర్‌డీఓ ఉమాదేవి, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వనమంచు పల్లె పాటల మద్దిలేటి కళా నైపుణ్యానికి ఎస్టీయూ సన్మానం



ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 20 (మనం బ్యూరో) : నాగర్ కర్నూలు జిల్లా కేంద్రం లో స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్ టి యు) ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశంలో వనమంచు పల్లె పాటల పుస్తక రచయిత, అభ్యుదయ కవి , ఎస్ టి యు నాయకుడు కల్వకోలు మద్దిలేటిని సంఘం సన్మానించినది. సమావేశానికి నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు కొత్త శ్రీధర్ రావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎం. పర్వత్ రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మట్టి వాసనల గుండెచప్పుడు వనమంచుపల్లె అని, అందులోని పాటలు సమాజ మార్పుకు, హితానికి పల్లె ప్రగతికి సోపానాలుగా ఉ ంటాయనడంలో అతిశయోక్తి లేదన్నారు. ప్రతి పాటలోను ఒక సామాజిక దృక్పథం, పల్లె వాసనలు గుబాళించునని, ప్రజా చైతన్యంలో తుపాకీ తూటల్లా దూసుకుపోగలవన్నారు. నెర్రెలు బారిన నేలలో చురకత్తులు మొలిపించగలవని శ్రీధర్ రావు అన్నారు. ప్రజాకవి, గాయకుడు, సంఘ నాయకుడు మద్దిలేటి మాట్లాడుతూ పల్లె జీవనం, అక్కడి ప్రకృతి కష్టజీవుల ఆవేదనలే ఈ పాటలకు స్ఫూర్తని అన్నారు. రవీంద్రభారతిలో గోరటి వెంకన్న, సిధారెడ్డి వంటి నాయకులు, సాహితీవేత్తల సమక్షంలో వనమంచు పల్లె పుస్తకం ఆవిష్కరించడం తర్వాత నేడు జిల్లా సంఘ భవనంలో ఎస్టియు కుటుంబ సభ్యులు ఇంత ఘనంగా సన్మానించడం, బడి బతుకులు, విద్యా పోకడలపై తన కలం ,గళం వినిపించాలని సభ్యులు కోరడం సంతోషదాయకం అన్నారు. స్టేట్ టీచర్స్ యూనియన్ ఆవిర్భవించి 80 వసంతాల ఉత్సవాలకు సిద్ధమైనదని అందులో ఉద్యమ సాంస్కృతిక వైభవాన్ని, ప్రజాగళాల గీతాలతో ఉత్సాహభరితం గావిస్తానని పేర్కొంటూ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు రమేష్, ప్రభాకర్, అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, వనపర్తి జిల్లా కార్యదర్శి హరి ప్రసాద్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# రైతు హామీలు అమలు చేయాలి

## బీఆర్ఎస్ పార్టీ డిమాండ్

**రైతు భరోసా, ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శ**

వనపర్తి, జూన్ 20 (మనం న్యూస్) : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వనపర్తి బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నివాసంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ నేతలు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, కృష్ణానాయక్ మాట్లాడారు. రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ వంటి పథకాల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు, యూరియా సరఫరా, సన్న ధాన్యానికి బోనస్ చెల్లింపు అంశాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు సహా సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని, రైతు సంక్షేమానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను కొనసాగించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై నెపం నెట్టకుండా ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీల అమలు వరకు బీఆర్ఎస్ ఉద్యమాలను కొనసాగిస్తుందని గట్టు యాదవ్ తెలిపారు. సమావేశంలో బోలెమోని లక్ష్మయ్య, నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, రాళ్ల కృష్ణయ్య, కె. మాణిక్యం, రఘువర్ధన్‌రెడ్డి, వేణుగోపాల్, గులాం ఖాదర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర మంత్రికి డీసీసీ అధ్యక్షుల స్వాగతం

మహబూబ్ నగర్, 20జూన్, (మనం న్యూస్) : తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను ప్రారంభించేందుకు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రానికి వచ్చిన రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ కి మహబూబ్ నగర్ లోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. రెసిడెన్షియల్ పాఠశాల ప్రారంభోత్సవం అనంతరంరాష్ట్ర మంత్రివర్యులు మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి విచ్చేసి పార్టీ కార్యకర్తలతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా,మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, , నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, కార్పొరేటర్ ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, సిరాజ్, ఎస్సీ సెల్ చైర్మన్ పసుల రాజు, యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అవేజ్. డీసీసీ సభ్యులు:సత్తూర్ చంద్రకుమార్ గౌడ్.బెక్కరి మధుసూదన్ రెడ్డి.మినాజుద్దీన్ టీపీసీసీ అధికార ప్రతినిధి జాహిద్ అక్తర్.తదితరులు పాల్గొన్నారు.



# రైతు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఏకైక లక్ష్యం

**పాలమూరు జిల్లాలో రబీ 2025-26 ధాన్యం కొనుగోళ్లు పూర్తి**

**21,585 మంది రైతుల ఖాతాల్లో రూ.265 కోట్లు జమా**

**మిగిలిన రూ.12 కోట్లు మూడు రోజుల్లో విడుదల**

**సవాళ్లను అధిగమించి విజయవంతంగా ధాన్యం సేకరణ పూర్తి చేశాం**

**అన్ని శాఖల అధికారులు అభినందించిన జిల్లా కలెక్టర్**

**మహబూబ్ నగర్ కలెక్టర్ ఖుష్బూ గుప్తా**



ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 20 (మనం బ్యూరో) : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రబీ 2025-26 సీజన్‌లో మహబూబ్‌నగర్ జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని కనీస మద్దతు ధర (ఎమ్మార్పీ) కింద కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 180 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి విజయవంతంగా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసినట్లు పాలమూరు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. జిల్లాలో ఐకేపీ (ఇందిరా క్రాంతి పథం), పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు), మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా మొత్తం 22,414 మంది రైతుల నుండి 1,16,345.800 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో 41,996 మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం, 74,349.800 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యాన్ని సేకరించినట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం వేగవంతంగా చెల్లింపులు చేస్తోందన్నారు. ఇప్పటి వరకు 21,585 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో సుమారు రూ.265 కోట్ల మేర ధాన్యం కొనుగోలు నగదును జమా చేసినట్లు తెలిపారు. మిగిలిన రైతులకు సంబంధించిన సుమారు రూ.12 కోట్ల చెల్లింపులు కూడా రానున్న మూడు రోజుల్లో విడుదల చేయనున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ అనేక సవాళ్ల మధ్య కొనసాగినప్పటికీ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని విజయవంతంగా పూర్తి చేసిందని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా కొనుగోలు ప్రక్రియ మధ్యలో జిల్లాలో అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షాల కారణంగా కొన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసే పరిస్థితులు ఏర్పడినప్పటికీ, అధికారులు వెంటనే స్పందించి తడిసిన ధాన్యాన్ని సమీప బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేసి రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నారని తెలిపారు. అదేవిధంగా కొన్ని రైస్ మిల్లుల్లో దిగుమతి సమస్యలు తలెత్తిన సందర్భాల్లో ధాన్యంతో వచ్చిన లారీలను సకాలంలో ఖాళీ చేయించడం జరిగిందన్నారు. ధాన్యం నిల్వలో ఆలస్యం జరగకుండా జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో ప్రత్యేక అధికారులను నియమించి నిరంతర పర్యవేక్షణ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ధాన్యం నాణ్యతకు సంబంధించి తేమ శాతం తాలు ( నాన్-ఎఫ్ఏక్యూ) వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు, తలెత్తిన సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రవాణా పరంగా లారీల కొరత కూడా ఒక ప్రధాన సవాలుగా మారినప్పటికీ, రైతులు కొ నుగోలు కేంద్రాల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితులు తలెత్తకుండా ఆర్టీఓ శాఖ సహకారంతో చెక్‌పోస్టుల ద్వారా అదనపు లారీలను సమకూర్చి కొనుగోలు కేంద్రాలకు పంపించడం జరిగిందని కలెక్టర్ వివరించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రతిరోజు వాతావరణ శాఖ హెచ్చరికలు, వెదర్ యాప్‌ల ద్వారా వర్షాల అవకాశాలను ముందుగానే గుర్తించి కొనుగోలు కేంద్రాలకు తగిన సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. ధాన్యం తడవకుండా ఉండేందుకు అదనపు టార్పాలిన్లను అందుబాటులో ఉంచి రైతులకు పంపిణీ చేయడం ద్వారా పంటను రక్షించినట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ప్రతిరోజు జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించడంతో పాటు, రైస్ మిల్లర్లతో నిరంతర సమన్వయం కొనసాగించామని కలెక్టర్ తెలిపారు. జిల్లా పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ, వ్యవసాయ, సహకార, పోలీసు, రవాణా శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించడంతో కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అందుకు అనుగుణంగా ప్రజా ప్రతినిధుల సహకారంతో అన్ని శాఖలు సమిష్టిగా పనిచేసి ధాన్యం కొనుగోళ్లను విజయవంతం చేశాయని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల విజయవంతమైన నిర్వహణకు సహకరించిన రైతులు, ఐకేపీ మహిళా సంఘాలు, మెప్మా సిబ్బంది, పీఏసీఎస్ నిర్వాహకులు, రైస్ మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్లు, పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ, వ్యవసాయ, మార్కెటింగ్ సహకార, పోలీసు, రవాణా శాఖల అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

# రా రైస్ వద్దు.. స్టీమ్ రైస్‌నే వాడాలి!

**ప్రభుత్వ బియ్యంపై విద్యార్థులే ఇచ్చిన క్లీన్‌చిట్ తనిఖీల్లో వెల్లడి**



మహబూబ్‌నగర్, జూన్ 20 (మనం ప్రతినిధి) : స్టీమ్ రైస్ నాణ్యతపై కొంతకాలంగా జరుగుతున్న విమర్శలు, అనుమానాలకు విద్యార్థులే చెక్ పెట్టారు. "మాకు ముడి బియ్యం (రా రైస్) అవసరం లేదు.. ప్రస్తుతం ఇస్తున్న స్టీమ్ రైస్‌నే కొనసాగించండి" అంటూ ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులు స్పష్టంగా తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. హైదరాబాద్ పౌర సరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు జనరల్ మేనేజర్ (అడ్మినిస్ట్రేషన్) ఈ. భాస్కర్ రావు నేతృత్వంలో ఓని ప్రత్యేక బృందం మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బీసీ బాలికల కళాశాల వసతి గృహం, ఫెయిర్ ప్రైస్ షాప్ నెం.13లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. టెక్నికల్ అసిస్టెంట్ రహ్మాన్, ఈటీఎఫ్ అధికారి సంతోష్, జిల్లా మేనేజర్ ఎ. రవి నాయక్, డిప్యూటీ తహసీల్దార్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రాజీవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తనిఖీల సందర్భంగా బియ్యం నమూనాలను సేకరించిన అధికారులు నేరుగా విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్టీమ్ రైస్ వండటానికి సులభంగా ఉండటమే కాకుండా, రుచిగా ఉండటంతో పూర్తిగా తింటున్నామని తెలిపారు. గతంలో సరఫరా చేసిన ముడి బియ్యంతో పోలిస్తే ప్రస్తుతం అందుతున్న స్టీమ్ రైస్ నాణ్యత మెరుగ్గా ఉందని పేర్కొన్నారు.

### ఆహార వృథాకు బ్రేక్

"స్టీమ్ రైస్ వల్ల భోజనం వృథా కావడం తగ్గింది. తినేందుకు బాగుంటోంది. అందుకే ఇదే కొనసాగించాలని కోరుతున్నాం" అని విద్యార్థులు చెప్పినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ప్రభుత్వం అమలు చేస్తున్న స్టీమ్ రైస్ సరఫరా విధానానికి విద్యార్థుల నుంచే బలమైన మద్దతు లభించినట్లైంది.

### లబ్ధిదారుల నుంచి సానుకూల స్పందన

విద్యార్థులతో పాటు ఇతర లబ్ధిదారులు కూడా స్టీమ్ రైస్ నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు అధికారులు తెలిపారు. నాణ్యమైన బియ్యం సరఫరా ద్వారా విద్యార్థులకు మెరుగైన ఆహారం అందుతుండటంతో పాటు ఆహార వృథాను తగ్గించడంలో ప్రభుత్వ నిర్ణయం ఫలితాలు ఇస్తోందని పేర్కొన్నారు.

### విమర్శలకు విద్యార్థులే సమాధానం

స్టీమ్ రైస్‌పై బయట వినిపిస్తున్న విమర్శలకు భిన్నంగా, నేరుగా వినియోగిస్తున్న విద్యార్థులే దీనికి మద్దతు తెలపడం విశేషంగా మారింది. "రా రైస్ వద్దు.. స్టీమ్ రైస్‌నే కొనసాగించండి" అనే విద్యార్థుల డిమాండ్ ఇప్పుడు ప్రభుత్వ సరఫరా వ్యవస్థకు పెద్ద బలంగా నిలిచిందని అధికారులు అభిప్రాయపడ్డారు.



# కట్ట మైసమ్మ హుండీ ఆదాయం రూ.68,396

ఉప్పునుంతల, జూన్ 20 (మనం న్యూస్): మండలంలోని లత్తీపూర్ గ్రామ పంచాయతీ శివారులో శ్రీశైలం--హైదరాబాద్ ప్రధాన రహదారిపై వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ కట్ట మైసమ్మ దేవస్థానంలో భక్తులు సమర్పించిన కానుకల హుండీ లెక్కింపు కార్యక్రమం శనివారం ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హుండీలో మొత్తం రూ.68,396 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఎడ్ల నరేష్ యాదవ్ మరియు దేవస్థాన ఈఓ శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ హుండీ ఆదాయం 2026 మే 1 నుంచి జూన్ 20 వరకు భక్తులు సమర్పించిన నగదు కానుకల ద్వారా సమకూరినదని వారు తెలిపారు. భక్తుల విశ్వాసానికి నిదర్శనంగా హుండీ ఆదాయం ప్రతి సంవత్సరం పెరుగుతూ ఉండటం ఆనందకర విషయమని పేర్కొన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిబంధనల మేరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎడ్ల నరేష్ యాదవ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ అద్దంకి సునీత, దేవాదాయ శాఖ జిల్లా పరిశీలకులు మదన్ మోహన్, దేవస్థాన ఈఓ శ్రీనివాసరావు, ఉప్పునుంతల ఎస్ఐ పుట్ట మహేష్ సమక్షంలో హుండీని తెరిచి లెక్కింపు చేపట్టారు. అలాగే ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామస్తుల సమక్షంలో హుండీలోని నగదు మొత్తాన్ని లెక్కించి నమోదు చేశారు. అనంతరం నగదు వివరాలను అధికారికంగా ధృవీకరించి బ్యాంకులో జమ చేయడానికి చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్, ఎస్‌బీఐ బ్యాంక్ సిబ్బంది, ఏఎస్ఐ రెడ్యానాయక్, పోలీసు సిబ్బంది యు.లింగం, వీరారెడ్డి, విష్ణు, ఆలయ కమిటీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం హుండీ ఆదాయాన్ని వినియోగిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. భక్తుల సహకారం, అమ్మవారి ఆశీస్సులతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతంగాకొనసాగుతాయని పేర్కొన్నారు.



# సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

**రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు**

**నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం**

**జోగులాంబ గద్వాల జిల్లా నుంచి పాల్గొన్న కలెక్టర్, గద్వాల ఎమ్మెల్యే, అధికారులు**




ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 20 (మనం బ్యూరో) : రాష్ట్రంలో సాగునీటి రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా చేపట్టిన ప్రతిష్ఠాత్మక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌తో పాటు నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల పరిధిలో కొనసాగుతున్న వివిధ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ అంశాలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యేలు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి , బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, సర్వే, నీటిపారుదల శాఖల ఉన్నతాధికారులతో కలిసి మంత్రి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల వారీగా, నియోజకవర్గాల వారీగా భూసేకరణ పురోగతిని మంత్రి క్షుణ్ణంగా సమీక్షించారు. ఇప్పటివరకు ఎంత భూమి సేకరించబడింది, ఎంత భూమి పీడీ (ప్రాథమిక నోటిఫికేషన్) దశలో ఉన్నది, ఎంత భూమి పీఎం స్థాయిలో ఉంది, ఇప్పటి వరకు ఎన్ని అవార్డులు ప్రకటించారు, ఎంత పరిహారం చెల్లించారు, ఇంకా ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయనే అంశాలపై అధికారులను ఒక్కొక్కరిగా ప్రశ్నించి మంత్రి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల జిల్లాలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పనులను వేగవంతం చేయాలని ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. ఆ దిశగా అధికారులు మరింత బాధ్యతతో పనిచేసి పెండింగ్‌లో ఉన్న సమస్యలను సెప్టెంబర్ 15లోగా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, సాగునీటి వనరుల విస్తరణ ద్వారానే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని తెలిపారు. రైతుల అభ్యంతరాలు, భూవివాదాలు, పరిహారం చెల్లింపులకు సంబంధించిన అంశాలను ప్రత్యేకంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులను ఆదేశించారు. జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు రెవిన్యూ, ఇరిగేషన్, సర్వే అధికారులతో ప్రత్యేక టీములు ఏర్పాటు చేసి కృషి చేస్తున్నామన్నారు. ప్రతి శుక్రవారం భూసేకరణ విషయంపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ ముందుకెళ్తున్నామన్నారు. ఆయా ప్రాజెక్టుల పనులు పూర్తయితే సాగునీటితోపాటు వ్యవసాయాధారిత పరిశ్రమలకు కూడా ప్రోత్సాహం లభించి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో సాగునీటి ప్రాజెక్టుల పాత్ర అత్యంత కీలకమని వారు అభిప్రాయపడ్డారు. అనంతరం జిల్లా పరిధిలో కొనసాగుతున్న భూసేకరణ ప్రక్రియపై సమగ్ర నివేదికలను సమర్పించారు. ఇప్పటివరకు జరిగిన భూసేకరణ, పరిహారం చెల్లింపులు, పెండింగ్‌లో ఉన్న కేసులు, కోర్టు వివాదాలు, రైతుల అభ్యంతరాలు తదితర అంశాలపై వివరాలు వెల్లడించారు. భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను అధిగమించేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సమావేశంలో క్షుణ్ణంగా మంత్రికి వివరించారు. అనంతరం నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయా ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. ఈ సమావేశంలో సాగు నీటి ప్రాజెక్టుల ఎస్సీలు, ఈఈలు, ఏఈలు, ఆర్డీవోలు, తహసిల్దార్లు, రెవెన్యూ అధికారులు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఇంజినీరింగ్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.






## కస్తూరిబా జూనియర్ కళాశాలలో పీజీసీఆర్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉప్పునుంతల, జూన్ 20 (మనం న్యూస్): మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పీజీసీఆర్టీ నర్సింగ్, పీజీసీఆర్టీ ఎంఎల్‌టీఈ (ఎంఎల్‌టీ) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు విద్యాలయ ప్రత్యేక అధికారి సైదా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కళాశాలలో ఇంటర్మీడియట్ స్థాయిలో నిర్వహిస్తున్న ఎంపీహెచ్‌డబ్ల్యూ (మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్), ఎంఎల్‌టీ (మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ) కోర్సులకు బోధించేందుకు అతిథి అధ్యాపకుల అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా పీజీసీఆర్టీ నర్సింగ్ ఒక పోస్టు, పీజీసీఆర్టీ ఎంఎల్‌టీ ఒక పోస్టును భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. సంబంధిత విద్యార్హతలు, అనుభవం కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల ఎంపికలో విద్యార్హతలతో పాటు గత అనుభవం, బోధనా నైపుణ్యాలను అంచనా వేసేందుకు డెమో తరగతులను కూడా నిర్వహిస్తామని తెలిపారు. డెమోలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలు, అనుభవ పత్రాలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో కలిసి ఈ నెల 22, 23 తేదీలలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం జూనియర్ కళాశాలలో నేరుగా దరఖాస్తు సమర్పించాలని కోరారు. విద్యారంగంలో సేవలందించాలనే ఆసక్తి ఉన్న అర్హులైన అభ్యర్థులు నిర్దేశిత తేదీల్లో దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రత్యేక అధికారి సైదా విజ్ఞప్తి చేశారు.



## లింగారెడ్డి పల్లి గ్రామంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం

వెల్దండ జూన్ 20 (మనం న్యూస్ ) మండల పరిధిలోని లింగారెడ్డి పల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం గ్రామ సర్పంచ్ మహ్మద్ అన్వర్ ఫాషా ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు... ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహ్మద్ అన్వర్ ఫాషా మరియు పాఠశాల ఉపాధ్యాయులు స్వామి వార్డు సభ్యులు స్వయంగా విద్యార్థులకు అక్షరాలు దిద్దించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జోగు రాములమ్మ, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ జోగు రేవతమ్మ, లింగమయ్య వార్డు సభ్యులు వట్టెపు అల్లాజి, మహ్మద్ జావీద్, నేతలు పుబ్బు శ్రీకాంత్ , పబ్బు కాశన్న, మల్లేపాకుల లాజర్, మల్లేపాకుల భాస్కర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి పదవ తరగతి మిత్రుల ఆర్థిక సాయం

ఉప్పునుంతల, జూన్ 20 (మనం న్యూస్) : మండల కేంద్రమైన ఉప్పునుంతల గ్రామానికి చెందిన శానమోని మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని 2003 సంవత్సరానికి చెందిన పదవ తరగతి సహాధ్యాయులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారి కష్టసమయంలో అండగా నిలుస్తూ రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. స్నేహబంధానికి నిదర్శనంగా మిత్రులు చేసిన ఈ సహాయం స్థానికంగా ప్రశంసలు అందుకుంది. ఆర్థిక సహాయం అందజేసిన వారిలో మేడమోని కాశన్న, సీహెచ్ మల్లయ్య, మేడమోని అర్జున్, గుద్దటి వెంకటయ్య, బాలు, పరశు రాములు, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు. మృతుని కుటుంబానికి భవిష్యత్తులో కూడా తమ వంతు సహకారం అందిస్తామని మిత్రులు తెలిపారు.



# ఉమ్మడి పాలమూరు జిల్లాలో 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి రైతుల కలలను సాకారం చేస్తాం**

**భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేసి పెండింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాశీ**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ప్రాజెక్టులు పరుగుల వైపు**

**రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు**



ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 20 (మనం బ్యూరో) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను సాగునీటి పరంగా సస్యశ్యామలం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, జిల్లాలోని రైతాంగం దశాబ్దాలుగా రైతులు ఎదురుచూస్తున్న నీటి కలను సాకారం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పనిచేస్తోందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో సాగునీటి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సాగునీటి ప్రాజెక్టుల సమీక్ష సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, భూసేకరణ, నిధుల అవసరం, సాంకేతిక సమస్యలు, పెండింగ్ పనులపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. మీడియా సమావేశంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ....., ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చారిత్రాత్మకంగా కరువు, వలసలు, నీటి కొరతకు ప్రతీకగా నిలిచిందన్నారు. ఆ పరిస్థితిని పూర్తిగా మార్చి పాలమూరును పచ్చని పంటలతో కళకళలాడే జిల్లాగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పమని సూచించారు. ఈ నెల 3, 4 తేదీలలో ముఖ్యమంత్రి స్వయంగా జిల్లాలో పర్యటించి వివిధ సాగునీటి ప్రాజెక్టులను పరిశీలించారన్నారు. సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి పనుల వేగంపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రస్తుతం భూసేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. ఎక్కడ భూ యజమానుల అభ్యంతరాలు ఉన్నాయి, ఎక్కడ పరిహారం సమస్యలు ఉన్నాయి, ఎక్కడ పరిపాలనా అనుమతులు అవసరమవుతున్నాయి అనే అంశాలన్నింటినీ ఈ సమావేశంలో సమీక్షించినట్లు వెల్లడించారు. రైతుల హక్కులకు భంగం కలగకుండా, చట్టబద్ధంగా, పారదర్శకంగా భూసేకరణ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించినట్లు చెప్పారు. పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, జూరాల, నెట్టెంపాడు, భీమ తదితర ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగునీటి రంగంలో కొత్త చరిత్ర సృష్టిస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టుల ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా భూగర్భ జలాలు పెరిగి గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు కూడా గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. మహాత్మా గాంధీ ఎత్తిపోతల పథకం ద్వారా అచ్చంపేట, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల పరిధిలో సుమారు 4 లక్షల 45 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా, గత కొన్నేళ్లుగా కేవలం మూడు మోటార్ల ద్వారానే నీటిని ఎత్తిపోస్తున్న పరిస్థితి నెలకొన్నట్లు మంత్రి తెలిపారు. దీనివల్ల రైతులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం అందడం లేదని చెప్పారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఎల్లూరు నుంచి నీటిని తరలించే చర్యలు చేపట్టడంతో పాటు మోటార్ల పునరుద్ధరణ, ఆధునీకరణకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాజెక్టుల నిర్వహణలో సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రాజెక్టులను కేవలం నిర్మించడం మాత్రమే కాకుండా రైతులకు నిజమైన ప్రయోజనం చేకూరేలా సమర్థవంతంగా నిర్వహించడంపైనా దృష్టి సారిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పాలమూరు ప్రాంతానికి సంబంధించిన అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు తప్పకుండా పూర్తి అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. పాలమూరు జిల్లాకు చెందిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉండడం వల్ల ఈ ప్రాంత అభివృద్ధిపై ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన భూసేకరణ కోసం ఇప్పటికే రూ.650 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. దీంతో భూసేకరణ ప్రక్రియ వేగవంతం అవుతోందని ఎంపీ తెలిపారు. రైతులకు న్యాయం జరిగేలా, ప్రాజెక్టు పనులు ఆలస్యం కాకుండా ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు. నేటి సమీక్ష సమావేశంలో చర్చించిన అంశాలన్నింటినీ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎంపీ వెల్లడించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి అవసరమైన నిధుల విడుదల, పరిపాలనా అనుమతులు, భూసేకరణ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను కేవలం అభివృద్ధి కార్యక్రమాలుగా కాకుండా రైతుల భవిష్యత్తును మార్చే మహత్తర కార్యక్రమాలుగా భావిస్తోందని సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ప్రాజెక్టుల పూర్తి ద్వారా వ్యవసాయోత్పత్తి పెరగడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. వలసలు తగ్గి రైతుల ఆదాయం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి విప్లవానికి నాంది పలికే ఈ ప్రాజెక్టులు పూర్తయితే లక్షలాది మంది రైతుల జీవితాల్లో గుణాత్మక మార్పు చోటుచేసుకోనుందన్నారు. పాలమూరును సస్యశ్యామల జిల్లాగా మార్చాలన్న ప్రభుత్వ సంకల్పం త్వరలోనే ఫలితాలను ఇస్తుందని ఎంపీ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఉదండాపూర్ అభివృద్ధిపై రాజకీయ రగడ

**నేను చేసిన పనులను తమ ఖాతాలో వేసుకుంటున్నారు**

**మాజీ ఎమ్మెల్యే లక్ష్మణ్ రెడ్డి ఫైర్**



మహబూబ్‌నగర్, జూన్ 20 (మనం ప్రతినిధి) : ఉదండాపూర్ ప్రాజెక్ట్ చుట్టూ మహబూబ్‌నగర్ జిల్లా రాజకీయాలు మ-రోసారి వేడెక్కాయి. తాను కష్టపడి సాధించిన అభివృద్ధిని కొందరు నాయకులు తమ ఘనతగా ప్రచారం చేసుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే లక్ష్మణ్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రైతుల కోసం కలెక్టర్‌తో సైతం వాగ్వాదానికి దిగానని, కానీ ఇప్పుడు అదే పోరాట ఫలితాలను ఇతరులు తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఉదండాపూర్, వల్లూరు ప్రాంతాల్లో గృహ స్థలాల కేటాయింపు, కాలనీల అభివృద్ధి, దళిత బంధు, బీసీ బంధు, గొర్రెల పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాల అమలులో తన పాత్ర కీలకమని స్పష్టం చేశారు. “400 మందికి న్యాయం చేసి వెయ్యి మందిని తొలగించారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు అబద్ధాలను ఆయుధాలుగా వాడుతున్నారు” అంటూ విమర్శించారు. “పాదయాత్ర కాదు... రాజకీయ డ్రామా”ప్రస్తుత ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని లక్ష్మణ్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**ఉదండాపూర్ ప్రాజెక్ట్‌ను అడ్డుకున్నది కాంగ్రెసే**

తెలంగాణ ఏర్పడిన తర్వాత మహబూబ్‌నగర్ జిల్లాకు వచ్చిన తొలి భారీ సాగునీటి ప్రాజెక్ట్ ఉదండాపూర్ ప్రాజెక్టేనని పేర్కొన్న ఆయన, ఈ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా అడ్డుకునేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. అన్ని అడ్డంకులను అధిగమించి వేల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు. రైతుల భూముల స్వాధీనం, పరిహారం చెల్లింపులు, సాగునీటి కల్పన వంటి అంశాల్లో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేసిందని తెలిపారు. అయి-ంతే ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు “నేనే చేశాను.. నేనే తెచ్చాను” అంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

**చెప్పుకోదగ్గ పని ఒక్కటీ లేదు**

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాకు కొత్తగా చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు తీసుకురాలేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధినే ఇప్పుడు తమ విజయంగా చూపించుకునే ప్రయత్నం జరుగుతోందన్నారు. “చరిత్రను చెరిపేయలేరు. చేసిన పనులను దాచలేరు” అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**ప్రజలే తీర్పు చెబుతారు**

ఉదండాపూర్ ప్రాజెక్ట్ నుంచి సంక్షేమ పథకాల వరకు జరిగిన ప్రతి అభివృద్ధికి చరిత్రే సాక్ష్యమని పేర్కొన్నరు, రాజకీయ లబ్ధి కోసం వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అభివృద్ధి చేసిన నాయకులు ఎవరు, ప్రచార రాజకీయాలు చేస్తున్నవారు ఎవరో ప్రజలే గుర్తించి తగిన తీర్పు చెబుతారని హెచ్చరించారు. “నేను చెమటోడ్చి సాధించిన అభివృద్ధిని ఇప్పుడు కొందరు తమ ఫోటోలు పెట్టుకుని అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ప్రజలు అన్నీ చూస్తున్నారు... నిజాన్ని గుర్తుంచుకుంటారు” అంటూ తన విమర్శలను మరింత పదునుపెట్టారు.

# బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి

**మండల అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు పిలుపు**



ఉప్పునుంతల, జూన్ 20 (మనం న్యూస్): అచ్చంపేటలో ఆదివారం నిర్వహించనున్న బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి అవగాహన సమావేశాన్ని విజయవంతం చేయాలని ఉప్పునుంతల మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంతో పాటు ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు సమగ్ర అవగాహన కల్పించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అచ్చంపేట పట్టణంలోని బీకే ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు ఈ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఎంతో కీలకమని, ప్రతి కార్యకర్త గ్రామస్థాయిలో సభ్యత్వ నమోదును విజయవంతం చేసే దిశగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ఓటరు నమోదు, సవరణలు, కొత్త ఓటర్ల చేర్పు వంటి అంశాలపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. ఆయన పార్టీ భవిష్యత్ కార్యాచరణ, సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నట్లు చెప్పారు. మండలంలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, యువజన నాయకులు, మహిళా కార్యకర్తలు, బీఆర్ఎస్ అభిమానులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కొత్త రవీందర్‌రావు కోరారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ సమావేశం పార్టీకి మరింత ఉత్సాహాన్ని కలిగిస్తుందని, కార్యకర్తలకు మార్గదర్శకంగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# చినుకు కాదు.. కొంగే కారణం!

## కొంగ దెబ్బకు గంటలపాటు కరెంట్ కట్

### ఖంగుతిన్న విద్యుత్ అధికారులు



ఉప్పునుంతల, జూన్ 20 (మనం న్యూస్): సాధారణంగా మేఘాలు కమ్ముకున్నా, చినుకు పడినా "ఇప్పుడే కరెంట్ పోతుంది" అని ప్రజలు అనుకోవడం సహజం. కానీ శనివారం ఉప్పునుంతల మండలంలో మాత్రం ఎలాంటి వర్షం లేదు, గాలి లేదు, దుమారం లేదు. అయినా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వినియోగదారులతో పాటు విద్యుత్ శాఖ అధికారులూ ఆశ్చర్యానికి గురయ్యారు. చివరకు గంటలపాటు సాగిన అన్వేషణలో అసలు కారణం తెలుసుకుని అందరూ అవాక్కయ్యారు. కరెంట్ కట్‌కు కారణం ప్రకృతి వైపరీత్యం కాదు. ఒక కొంగ! శనివారం ఉదయం ఉప్పునుంతల ప్రాంతానికి విద్యుత్ సరఫరా అందించే 33/11 కేవీ లైన్ అకస్మాత్తుగా బ్రేక్‌డౌన్ కావడంతో పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సాధారణంగా ఇలాంటి సమస్యలు వర్షాలు, ఈదురుగాలులు లేదా చెట్ల కొమ్మలు తీగలపై పడటంతో ఏర్పడుతుంటాయి. కానీ అలాంటి పరిస్థితులు ఏవీ కనిపించకపోవడంతో విద్యుత్ అధికారులు తలలు పట్టుకున్నారు.సమాచారం అందుకున్న వెంటనే ఏఈ కొండల్ ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది రంగంలోకి దిగారు. లైన్‌మెన్లు బాలస్వామి, వెంకటేష్, బారయ్య, సాయిబాబులు అచ్చంపేట నుంచి ఉప్పునుంతల వరకు విద్యుత్ లైన్‌ను అంగుళం అంగుళం పరిశీలించారు. ఎక్కడా లోపం కనిపించకపోవడంతో సమస్య మరింత మిస్టరీగా మారింది. చివరకు ఓ కుంట సమీపంలోని విద్యుత్ తీగల వద్ద కొంగ తగలడంతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి బ్రేక్‌డౌన్ సంభవించినట్లు గుర్తించారు. వెంటనే సిబ్బంది అక్కడికి చేరుకుని కొంగను తొలగించి లైన్‌ను సరిచేశారు. అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. గంటలపాటు వెతికినా కనిపించని లోపం వెనుక ఒక కొంగ ఉందని తెలిసి అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. "చినుకు పడితే కరెంట్ పోతుంది" అనే మాట అందరికీ తెలుసు. కానీ "కొంగ తగిలితే కూడా కరెంట్ పోతుంది" అని ఈ ఘటన మరోసారి నిరూపించిందని స్థానికులు సరదాగా వ్యాఖ్యానించారు. ఎలాంటి ప్రకృతి అంతరాయం లేకుండానే ఒక పక్షి కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. సమస్యను త్వరితగతిన గుర్తించి పరిష్కరించిన విద్యుత్ సిబ్బందిని వినియోగదారులు అభినందించారు.

## నీట్ అభ్యర్థులకు శుభాకాంక్షలు

### విద్యా కమిషన్ సభ్యుడు డా,,వెంకటేష్



చారకొండ,జూన్20(మనం న్యూస్) : నేడు నీట్ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులందరికీ తెలంగాణ విద్యా కమిషన్ సభ్యుడు డాక్టర్ చారకొండ వెంకటేష్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియపరిచారు.ఆదివారం పునర్నిర్వహించబడుతున్న నీట్ ఈ కీలక పరీక్షలో విద్యార్థులు ఎలాంటి ఆందోళనలకు,ఒత్తిళ్లకు గురికాకుండా పూర్తి ఆత్మవిశ్వాసంతో,ప్రశాంతమైన మనస్సుతో పరీక్ష రాయాలని ఆకాంక్షించారు. మీ కష్టానికి తగ్గ ఫలితం తప్పకుండా లభిస్తుంది.లక్ష్యంపై దృష్టి సారించి,ధైర్యంగా ముందుకు సాగండి.మీ అందరికీ ఉజ్వల భవిష్యత్తు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని డాక్టర్ చారకొండ వెంకటేష్ పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు.

# రైతు వ్యతిరేకి ప్రభుత్వం

వడ్ల కొనుగోలుపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్ నగర్, 20జూన్, (మనం న్యూస్) : రైతులు పండించిన పంట చివరి గింజ వరకు కొనుగోలు చేయమని ప్రభుత్వం చెప్పడం బాధ కలిగించింది. రైతు వ్యతిరేక ప్రభుత్వం ఇది అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు.శనివారం ఆయన మాట్లాడుతు ఎన్నికల కంటే ముందు రైతు ప్రభుత్వం అని అనేక హామీలు ఇచ్చారు.. వరంగల్ రైతు డిక్లరేషన్ అమలు చేయలేదు. రైతు భరోసా ఇస్తామని అన్నారు ఇవ్వలేదు. నాణ్యమైన కరెంటు.. విత్తనాలు ఇస్తామని మాట తప్పింద్రు కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా పెట్టారు. ప్రైవేట్ కి రైతులు అమ్ముకున్నారు.. కొన్న కొన్ని వడ్లకు కూడా బోనస్ ఇవ్వలేదు. కెసిఆర్ హయాంలో కల్లాల వద్ద వడ్లు కొన్నాము.. బోనస్ ఇచ్చాము.. రుణమాఫీ చేసాము..కరోనా సమయంలో కూడా రైతుల వద్ద వడ్లు కొని బ్యాంకు అకౌంట్ లో డబ్బులు వేసాము.యూరియా లేదు.రామగుండము లో యూరియా ఉత్పత్తి కేంద్రం ఉన్న అవసరమైన యూరియా తీసుకోవడం లేదు. వడ్లు కొనకపోతే కిషన్ రెడ్డి సంగతి చూస్తా అన్న రేవంత్ రెడ్డి మాట తప్పిండు ఎండ అనక.. వర్షం అనక వ్యవసాయం చేస్తే రైతులు పండించిన పంట అమ్ముకునేందుకు తిప్పలు పడుతున్నారు. రైతుల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదు. రైతులు చనిపోతే కనీసం భీమా ఇవ్వడం లేదన్నారు. యూరియా..అడుగు పిండి తీసుకోవడానికి పోతే రైతులను వ్యాపారులు ఇబ్బందులు పెడుతున్నారు.. ఇతర పురుగుల మందులు తీసుకోవాలని..అట్లా అయితేనే యూరియా..అడుగుపిండి ఇస్తామని చెప్పడం సరికాదు.వరి పంట వేయవద్దని ముఖ్యమంత్రి..మంత్రులు అంటున్నారు.. సరి కాదు ఇది.. గతంలో వారితో పాటు ఇతర పంటలు వేసుకోవాలి అంటే గొగ్గోలు పెట్టిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు అసలు వరి వేయవద్దని మాట్లాడుతున్నారాని ఆరోపణలు చేశారు.





## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి

### డిసిసి ప్రధాన కార్యదర్శి బలరాం గౌడ్

చారకొండ,జూన్20(మనం న్యూస్) : పర్యావరణ పరిరక్షణలో భాగంగా చారకొండ మండల కేంద్రంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం ఎన్ఆర్ఈజీఎస్ చారకొండ ఏపీఓ లక్ష్మయ్య ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమానికి డిసిసి ప్రధాన కార్యదర్శి జమ్మి కింది బలరాం గౌడ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకటయ్య గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొని మండల కేంద్రంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది ముక్కోటి జీవకోటి మండకు భూమిపై సహజ సమతుల్యతను కాపాడడానికి,కాలుష్యాన్ని తగ్గించడానికి,మొక్కలు నాటడం సహజ వనరులను కాపాడుకోవడం కోసం మొక్కలు నాటడం చాలా ఉపయోగకరమని ఈ సందర్భంగా అన్నారు. ముఖ్యంగా పర్యావరణాన్ని పరీక్షించడం అంటే మొదటగా ప్లాస్టిక్ వాడడం తగ్గించాలి,అలాంటి ప్లాస్టిక్ తయారు చయడం మొదటగా కంపెనీలు నిధి నిషేధించాలని,ప్లాస్టిక్ అనేది చిన్నపిల్లలు తినే కురుకురా పాకెట్ నుండి పాల ప్యాకెట్ వరకు ప్లాస్టిక్ ప్లాస్టిక్ కవర్ లోనే పంపిణీ జరుగుతుంది.కనుక మొదటగా పర్యావరణాన్ని కాపాడాలంటే ప్లాస్టిక్ వాడకం మానేయాలని ఈ సందర్భంగా తెలియపరిచారు.గ్రామాలలో పరిసర ప్రాంతాలలో మొక్కలు నాటడం వలన పర్యావరణాన్ని కాపాడి,వాతావరణం వర్షం రావడానికి అనుకూలంగా ఉంటుందని కనుక ప్రజలు తమ పరిసర ప్రాంతాలలో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు తెలియపరిచారు.ఈ కార్యక్రమంలో చారకొండ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు పిల్లి లక్ష్మమ్మ శ్రీరాములు,కందికంటి వినిత,గణేష్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జెసిబి చింతపల్లి వెంకటయ్య,సంబంధితఅధికారులు, గ్రామప్రజలు,మహిళలు పాల్గొనడం జరిగింది.

## విద్యార్థులతో కలిసి ఎంఈఓ కొండల్ రెడ్డి భోజనం

వంగూర్ జూన్ 20 ( మనం న్యూస్) : వంగూరు మండల పరిధిలో గల డిండి చింతపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను తెలుసుకొనుటకు విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎం ఈ ఓ కొండల్ రెడ్డి పాఠశాలలో భోజనం తయారు చేసే సిబ్బంది నాణ్యత పరిశుభ్రత పాటించాలని వాళ్లకు సూచించారు . కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామ్ భీష్మ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ చిన్నయ్య వార్డు సభ్యులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ కూలీల ఉదారత

## మృతుడి కుటుంబానికి 10,000 రూపాయల ఆర్థిక సహాయం అందజేత



వంగూర్ జూన్ 20 ( మనం న్యూస్) : ఉపాధి హామీ కూలీలు చేసిన సహాయాన్ని అభినంధించి తన వంతు సహాయంగా 5000 రూపాయల ఆర్థిక సహాయం అందజేసిన..గాజర గ్రామ సర్పంచ్ పులిగిల్ల శ్రీపతి రావు వంగూరు మండలంలోని గాజర గ్రామానికి చెందిన కొంకి హుస్సేనమ్మ w/o హుస్సేన్ అకాల మరణం అందరిని బాధించిన సందర్భంలో ఆమె కుటుంబం యొక్క పేదరికాన్ని గుర్తించి ఎంతో కొంత మా వంతు గా సహాయం చేయాలి అనే దృఢ సంకల్పంతో గాజర గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ దొడ్డి ప్రశాంత్ తోటి కూలీలు అందరితో మాట్లాడి అందరిని ఏకం చేసి తలో కొంత ఒక్కొక్కరుగా 100 రూపాయల డబ్బులు వేసుకొని 10,000 రూపాయలు ఆమె కుటుంబ సభ్యులకు ఇప్పిచ్చేటట్టుగా ప్రధాన పాత్ర పోషించడం జరిగింది. ఇంత మంచి కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలందరి నీ ఏకం చేసి వారికి సహాయం అందించుటలో ముఖ్య పాత్ర పోషించిన ఫీల్డ్ అసిస్టెంట్ ప్రశాంత్ గ్రామపంచాయతీ తరుపున అభినందించటం జరిగింది. ఈ కార్యక్రమంలో కోనేటిపూర్ గ్రామ సర్పంచ్ పానుగంటి బాలయ్య 7వ వార్డ్ మెంబర్ చింతకుంట్ల సైదులు గాజర గ్రామ బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కోట్ల ఎల్లయ్య యాదవ్ చింతకుంట్ల నిరంజన్ దొడ్డి విష్ణు గ్రామ పంచాయతీ సెక్రటరీ రాజు ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు..



## సాధించేవరకు పోరాటం ఆగదు : ఎర్రవల్లి బాధితులు

చారకొండ,జూన్20(మనం న్యూస్) : ఎర్రవల్లి భూ నిర్వాసితుల పోరాటం సాధించేవరకు పోరాడుతామని ముక్కుముడిగా ప్రభుత్వానికి హెచ్చరించారు. చారకొండ మండలం ఎర్రవల్లి గ్రామంలో చేపడుతున్న ఎర్రవల్లి భూ నర్వాసితుల రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 201వ రోజుకు చేరాయి.ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ రద్దుచేసి భూ నిర్వాసితులకు న్యాయం చేసే వరకు ఈ భూపొరాటం కొనసాగిస్తామని ముక్కుముడిగా ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు,ఇటు వెల్దండ మండలానికి రెవిన్యూ గ్రామముగా చివరి గ్రామం,చారకొండ మండలానికి చివరి గ్రామపంచాయతీ ఒక మారుమూల ప్రాంతమని ఇరు మండలాలు మారుమూల గ్రామం అని గాలికి వదిలేసి పట్టించుకోకుండ కాలయాపన చేస్తున్న మండల ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, ప్రభుత్వానికి ఒక దిక్కూచిగా మారి మా సత్తా ఏంటో చూపిస్తామని భూ నిర్వాసితులు హెచ్చరించారు.కార్యక్రమంలో ఎర్రవల్లి,ఎర్రవల్లి తండా బాధితులు పాల్గొన్నారు.

# మెగా ఉచిత వైద్య శిబిరం

**ఉచిత ఆరోగ్య పరీక్షలు సద్వినిగం చేసుకోండి**

**చక్కెర వ్యాధి నిపుణులు డా. వీరమల్లరత్**

**వర్షాకాల ప్రభావం నవజాశ శిశువుల ఆరోగ్యం**

**నవజాత శిశువుల వైద్య నిపుణులు డా. వీరమల్ల రంజిత్**




ఊరుకొండ జూన్ 20 (మనం న్యూస్) : స్థానిక మండల పరిధిలోని ఇప్పా పహాడ్ గ్రామంలో ఆదివారం నాడు ఉచిత వైద్య మెగా శిబిరం స్థానిక కల్వకుర్తి ప్రైవేట్ వెంకటరమణ దావఖాన ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని స్థానిక డాక్టర్లు తెలియజేశారు.ఈ నేపధ్యంలో చక్కెర వ్యాధి నిపుణులు వీరమల్ల శరత్ మాట్లాడుతూ... ఆరోగ్యమే మహాభాగ్యం అనేది మన పెద్దలు చెప్పిన మాట.మానవ జీవితంలో సంపద కంటే ఆరోగ్యం ఎంతో విలువైనదని,అయితే నేటి యాంత్రిక జీవనంలో సరైన అవగాహన లేకపోవడం ఆర్థిక ఇబ్బందుల వల్ల చాలామంది నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇటువంటి పేద మధ్యతరగతి ప్రజల కోసం ప్రభుత్వాలు స్వచ్ఛంద సంస్థలు ప్రైవేటు ఆసుపత్రులు గ్రామాలలో ఉచితం మెగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాయి.ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకొని మెరుగైన ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు.ఖరీదైన పరీక్షలు ప్రైవేటు ఆసుపత్రిలో రక్తం పరీక్షలు ఈసీజీ స్కానింగ్ వంటి,వాటికి వేల రూపాయల ఖర్చు అవుతాయి కానీ,క్యాంపుల్లో అవన్నీ పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తుంటారు. నిపుణులైన వైద్యులు పేరు మోగిన వైదేనిపుణులు అందుబాటులో ఉండి,ప్రజలకు ఉచితంగా సలహాలు సూచనలు ఇవ్వడం జరుగుతుంది.ఉచితం మందుల పంపిణీ పరీక్షలు నిర్వహించి డాక్టర్లు సూచించిన మందులను కూడా ఉచితంగా అందజేయడంలో ముందుంటారు .ముందస్తు గుర్తింపు బీపి,షుగర్, క్యాన్సర్,వంటి సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన చికిత్స పొందే అవకాశం కూడా ఉంటుందని తెలియజేశారు. ప్రజల బాధ్యతగా గ్రామీణ, పట్టణ,ప్రాంతాల్లోని పేద ప్రజలు ఎలాంటి భయం మొహమాటం లేకుండా ఈ వైద్య శిబిరాలు ఉపయోగించుకోవాలని చిన్న చిన్న అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయడం వల్ల అవి పెద్ద వ్యాధులుగా మారే ప్రమాదం పొంచి ఉందని,ఏదైనా తీవ్రమైన సమస్య ఉంటే క్యాంప్ల ద్వారా ఉచిత శస్త్ర చికిత్సలు కూడా చేయించుకోవచ్చని సమాచారం చేరడం జరిగింది.నవజాత శిశువుల వైద్య నిపుణులు రంజిత్ కుమార్ వ్యాఖ్యానిస్తూ...నివారణ కంటే చికిత్స మేలు.అనేది వైద్యుల సూత్రం ఇలాంటి ఉచిత శిబిరాలు లభించడం ఒక గొప్ప అవకాశం ఊరి ప్రజలు కానీ,ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి అనే నినాదంతో.తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి,సమీపంలోని ఎక్కడ ఉచితం వైద్య మెగా శిబిరాలు జరిగిన పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని నినదించారు.



## విద్య హక్కు.. వ్యాపారం కాదు

### ఏఐఎస్ఎఫ్ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్ కుమార్

ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 20 (మనం బ్యూరో) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను 27 వేల నుంచి 4 వేల వరకు తగ్గిస్తున్నామని చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం అచ్చంపేట మహిళల జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..., దేశ భవిష్యత్తుకు పునాది అయిన విద్యను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయకుండా పాఠశాలల సంఖ్య తగ్గింపు గురించి మాట్లాడటం ఆందోళనకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం కాకుండా, వాటిని మరింత బలోపేతం చేసి నాణ్యమైన విద్య అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రస్తుతం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్రంగా దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. అతిగా ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని వెంటనే అమలు చేసి కఠినంగా అమలుపరచాలని డిమాండ్ చేశారు. విద్యను వ్యాపారంగా మార్చే ధోరణిని అరికట్టి, విద్యను హక్కుగా అందించే విధానాలను ప్రభుత్వం చేపట్టాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు, ఫర్నిచర్ వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని కోరారు. విద్య హక్కు చట్టం-2009 రైట్ ఇన్ఫర్మేషన్ యాక్ట్ ప్రకారం ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో 25 శాతం సీట్లను పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉచిత విద్య కోసం కేటాయించాలన్నారు. ఈ నిబంధనను తెలంగాణ ప్రభుత్వం కచ్చితంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్య అనేది ప్రతి పౌరుని ప్రాథమిక హక్కు అన్నారు. దానిని వ్యాపార వస్తువుగా మార్చే ప్రయత్నాలను ఏఐఎస్ఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి, అందరికీ సమాన విద్యా అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రవళిక, అనూష, శిల్ప, పవిత్ర, స్రవంతి, ప్రవీణ, సబీనా బేగం, మల్లమ్మ, పావని, లక్ష్మి, కళా, చంద్రకళ, ఎల్. యమునా తదితరులు పాల్గొన్నారు.

## నీట్ అభ్యర్థులకు ద్విచక్ర వాహనదారులు సహకరించండి

### మహబూబ్ నగర్ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 20 (మనం బ్యూరో) : మీరు ఆదివారం నీట్ ఎగ్జామ్ రాసే ప్రతి ఒక్కరికి ఎగ్జామ్స్ సెంటర్ల వరకు ద్విచక్ర వాహనం ద్వారా సహకరించాలని మహబూబ్ నగర్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అన్నారు. రేపు జరగబోయే నీట్ ఎగ్జామ్ కు హాజరయ్యే విద్యార్థులకు వాళ్లు ఎక్కడైనా కనిపిస్తే వాళ్లకు ఎగ్జామ్ జరగబోయే సెంటర్ కు వారిని మీయొక్క ద్విచక్ర వాహనంపై సమయం వృధా కాకుండా వారిని చేర్చగలరని మహబూబ్నగర్ ప్రజలను కోరడం జరిగింది. ఇట్టి ఎగ్జామ్ కు ఉమ్మడి జిల్లా నుండి విద్యార్థులు హాజరవుతారన్నారు. కావున వారికి ఎగ్జామ్ సెంటర్లు త్వరగా దొరకవు కావున వారికి ఎగ్జాం సెంటర్లకు చేర్చాలని విజ్ఞప్తి చేశారు. కావున దయచేసి మహబూబ్నగర్ ప్రజలు ఎగ్జామ్ రాసే విద్యార్థులకు సహకరించవలసిందిగా కోరడమైనది.



# దుర్వాసనతో గద్వాల పట్టణం?

**అనే శీర్షికకు స్పందన**

**స్పందించిన మున్సిపల్ అధికారులు**

**పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం**



ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 20 (మనం బ్యూరో) : శుక్రవారం మనం తెలుగు దినపత్రికలో "దుర్వాసనతో గద్వాల పట్టణం"అనే శీర్షికకు స్పందించిన మున్సిపల్ అధికారులు శనివారం ఉదయం 6:00 నుండి చెత్తను తీసివేయడానికి సిబ్బంది పనిలో నిమజ్జమయ్యారు.

పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో చెత్త డంపింగ్ యార్డ్ సమస్యపై ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దుస్థితి మనం దినపత్రికలో ప్రచురితం అయిన వెంటనే అధికారులు స్పందించి నెలలుగా చెత్త పేరుకుపోయిన వాటిని పూర్తిగా సిబ్బంది తొలగించారు. దీంతో రాఘవేంద్ర కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల తరబడి కంపుతో పాటు దుర్వాసన, ఈగలు దోమలు అధికం కావడం పట్ల కంటిమీద కొనుక్కు లేకుండా పోయిందని కాలనీవాసులు అన్నారు. మనం దినపత్రికలో శీర్షిక వచ్చిన వెంటనే డంపింగ్ చెక్కను పూర్తిగా తొలగించడం మాకెంతో సంతోషం ఉందని పట్టణ ప్రజలు రాఘవేంద్ర కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. చెత్తను తొలగించడంతో పాటు చుట్టుపక్కల ప్రదేశాలంతా శానిటైజర్, పరిసర ప్రాంతాలంతా బ్లీచింగ్ చల్లి శుభ్రం చేయడం జరిగిందన్నారు. పట్టణంలో ఇక ముందు చెత్తాచెదారం ఎక్కడ పోకుండా మున్సిపల్ సిబ్బందికి కమిషన్ ఆదేశాలు తయారు చేశారు. వర్షాకాలం రావడం వల్ల పరిసర ప్రాంతాలంతా పరిశుద్ధంగా ఉండాలని చైర్మన్, కమిషనర్ మున్సిపల్ సిబ్బందికి తెలియజేశారు. పట్టణ పరిశుభ్రత పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.





## బాల్య మిత్రుల ఆర్థిక సాయం

తిరుమలగిరి జూన్21 (మనం న్యూస్) : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-94 పదవ తరగతి బాల్యమిత్రుడు సంకేపల్లి సోమిరెడ్డి ఇటీవల మృతి చెందారు. వారి కుమారుడు రిత్విక్ రెడ్డి కి బాల్య మిత్రులందరికీ రూ 30000 లు ముప్పైవేల ఆర్థిక సహాయం అందజేశారు. సోమిరెడ్డి కుటుంబాన్ని విమర్శించి సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మిత్రులు దుంపల కృష్ణారెడ్డి, పయంల వెంకన్న, బేతు ఎర్ర య్య, కొంపెల్లి బుచ్చిమల్లు గౌడ్, మరియు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మంత్రి ఉత్తమ్, కుందూరు జానారెడ్డి జన్మదిన వేడుకలు

సూర్యాపేట టౌన్, జూన్ 19 మనం న్యూస్: రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డిల జన్మదిన వేడుకలను పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (రెడ్ హౌస్) లో ఆ పార్టీ రాష్ట్ర , జిల్లా, మండల నాయకులు , కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, జిల్లా కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు అంజాద్ అలీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు భైరు వెంకన్న గౌడ్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు వేములకొండ పద్మ, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం, 33వ వార్డు స్థానిక కౌన్సిలర్ నాగుల వాసు, మున్సిపల్ కౌన్సిలర్లు సయ్యద్ తన్వీర్ హుస్సేన్, చిలుముల సునీల్ రెడ్డి, వల్దాసు లక్ష్మీ శ్రీనివాస్(రెబల్), కుంభం రాజేందర్,గుణగంటి హేమ సతీష్, పిల్లల భవాని రమేష్ నాయుడు, పట్టణ ఎస్సి సెల్ అధ్యక్షుడు పిడమర్తి నాగరాజు, జిల్లా కాంగ్రెస్ నాయకులు అక్కినేపల్లి జానయ్య, గడ్డం వెంకన్న, సాజిద్ ఖాన్, చెంచల నిఖిల్, నరేందర్ నాయుడు, మన్సూర్(ఆర్ట్), ఇఖ్రార్ అహ్మద్, నీడ్స్ సాజిద్, గుణగంటి సైదులు, సతీష్, నిరన్, సీతారాం పాల్గొన్నారు.

## సర్ పై అవగాహన

తిరుమలగిరి జోన్ 21 (మనం న్యూస్) : తిరుమలగిరి మండలం తొండ గ్రామంలోని రైతు వేదికలో మండలంలోని అన్ని గ్రామాల బూత్ లెవెల్ ఏజెంట్లకు ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్. ఐ.ఆర్) పైన అవగాహన కార్యక్రమాన్ని శనివారశీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ బి. హరి ప్రసాద్ మాట్లాడుతూ సర్ ప్రక్రియను చాలా జాగ్రత్తగా, అన్ని వివరములను సేకరించాలని 2002 ఓటర్ లిస్టును, ప్రస్తుత హోటల్ లిస్టును దగ్గర పెట్టుకొని మ్యాపింగ్ చేయాలని, చనిపోయిన, గ్రామంలో లేని వారిని డబుల్ ఓటర్లను గుర్తించి తొలగించాలని సూచించారు. ఈనెల 26 నుండి వచ్చేనెల 24 వరకు ఎనిమిరేషన్ ఫారం లను పంపిణీ చేసి తిరిగి ఓటర్ల నుండి తీసుకొని వాటిని జాగ్రత్తగా పరిశీలించి వాటిని ఆన్లైన్లో నమోదు చేయాలని బి ఎల్ ఓ లకు సూచించామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని చాలా ప్రాముఖ్యతగా గుర్తించి అందరూ సహకరించాలని అందుకు గాను రాజకీయ పార్టీల బూతు లెవెల్ ఏజెంట్లు గ్రామంలో బూత్ లెవెల్ అధికారులకు సహకరించాలని కోరారు. శిక్షణలో డిప్యూటీ తహసిల్దార్ జాన్ మహమ్మద్, సూపర్వైజర్లు అనిత ,సుభద్ర, కిషన్ స్థానిక సర్పంచ్ పాల్గొన్నారు.






## ప్రైవేట్ స్కూళ్లల్లో ఫీజులను నియంత్రించాలి : బీఆర్ఎస్వి

తుంగతుర్తి: జూన్ 20 ,(మనం న్యూస్) : ప్రైవేట్ స్కూళ్లల్లో ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నాయకులు ఎంఈఓ బోయిని లింగయ్యకు వినతిపత్రం అందించారు. మధ్యతరగతి, పేద విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక ఉపశమనం కలిగించడమే లక్ష్యంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు తమిళనాడు తరహాలో తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ నాయకులు తడకమళ్ళ రవికుమార్, గునిగంటి సంతోష్ గౌడ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతకుంట్ల మనోజ్, గోపగాని రమేష్ గౌడ్, బొజ్జ సాయికిరణ్, కొండగడుపుల వెంకటేష్, కొండగడుపుల శ్రీకాంత్, తడకమళ్ళ మధు తదితరులు పాల్గొన్నారు.

## కోదాడ నియోజకవర్గ పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంత్రి ఉత్తమ్ జన్మదిన వేడుకలు

కోదాడ, జూన్ 20(మనం న్యూస్) : రెవరెండ్ పాస్టర్ కే శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక గుడిబండ రోడ్ లో గల బేతేలు గాస్పెల్ చర్చి నందు తెలంగాణ రాష్ట్రభారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిషప్ ఏ జే సామ్యేలు పాల్గొని పాస్టర్లు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేసి మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రెవరెండ్ పాస్టర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైస్తవుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి వేలకోట్ల రూపాయలు నిధులు తీసుకువచ్చి కోదాడ హుజూర్ నగర్ నియోజకవర్గాల్లో అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్న తమ అభిమాన నాయకుడు ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నతమైన పదవులు అందుకొని ప్రజలకు సేవలు అందించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలని ప్రభువైన యేసుక్రీస్తు పేరట ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పాస్టర్ల దీవెనలు అందజేశారు. పాస్టర్ పి సైమన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోదాడ నియోజకవర్గ అధ్యక్షులు బ్రదర్ రామారావు, సెక్రెటరీ కొర్నేలు, కోదాడ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, ఫోర్ కమిటీ వర్కింగ్ చైర్మన్ పాస్టర్ వి శ్రీనివాస్ గౌడ్, చీఫ్ కోఆర్డినేటర్ పాస్టర్ రూపస్ నాయక్, యూత్ నియోజకవర్గ ప్రెసిడెంట్ పాస్టర్ సురేష్, ట్రెజరీ పాస్టర్ పాల్ చారి వివిధ మండలాల అధ్యక్షులు కోదాడ పాస్టర్ ఏసుబాబు, నడిగూడెం పాస్టర్ గాబ్రియేలు, చిలుకూరు పాస్టర్ అబ్రహాము, కోదాడ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ జోషఫ్ రాజు, సెక్రెటరీ పాస్టర్ అమేస్, స్టెఫెన్ సంతోష్ పాల్ కిషోర్, ఏనోస్ తదితరులు పాల్గొన్నారు.

